




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక :365 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శనివారం 5 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :365 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SAT 5 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## రాజమండ్రిలో సగం కాలుష్యానికి
# కారణం ఇదే

- పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్లు
- రాజమండ్రి కాలుష్యంలో సగం ఆ పరిశ్రమ వల్లేనన్న పవన్
- పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- కోర్టు కేసులను వేగవంతం చేయాలని న్యాయవాదులకు ఆదేశాలు
- స్వచ్ఛ గోదావరి లక్ష్యంగా ముందుకెళతామన్న ప్రభుత్వం

**పెన్ పవర్ డెస్క్:**రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు.

**పుష్కర కాలంగా పన్ను ఎగవేత**

2016 నుంచి కాతేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమండ్రి నగరపాలక సంస్థకు గానీ ఆంధ్ర పేపర్ మిల్లు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు సుమారు రూ. 21.34 కోట్ల మేర పన్నులు బకాయిపడిందని ఆయన తెలిపారు. పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ, యాజమాన్యం కోర్టులను ఆశ్రయించి జాప్యం చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకుంటోందని

- మిగతా 2లో

# అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

- ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్
- ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ
- కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ
- విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు.



అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు.

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు.

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.



## కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం...

- కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్
- కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమం సందర్శన
- మాతా అమృతానందమయి ఆశీస్సులు అందుకున్న లోకేశ్
- ఆశ్రమంలోని అమృత విశ్వ విద్యాపీఠాన్ని పరిశీలించిన వైనం
- ఈ పర్యటన వ్యక్తిగతమని, అధికారికం కాదని సమాచారం

- మిగతా 2లో




## ఏపీలో ఉత్తమ ఉపాధ్యాయుల జాబితా విడుదల

**పెన్ పవర్ డెస్క్:** 2026 సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ నుంచి 79 మంది, ఇంటర్ బోర్డు నుంచి 24 మందిని ఎంపిక చేసింది. ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, లెక్చరర్లు, ప్రిన్సిపాళ్ల పేరుతో జీవో జారీ చేసింది. రాష్ట్రస్థాయి కమిటీ సిఫార్సుల మేరకు ఈ అవార్డులను ఖరారు చేశారు. శనివారం గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ప్రభుత్వం సత్కరించనుంది.

## నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసుల
# 60 ఏళ్ల నిరీక్షణకు తెర

- నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసులకు ఇళ్ల పట్టాల మంజూరు
- 60 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం
- 1,215 పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా కేబినెట్ నిర్ణయం
- మంత్రి నారాయణ చొరవతో సీఎం చంద్రబాబు ఆమోదం
- త్వరలో సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

- మిగతా 2లో





## ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు..

అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!

- మోదీని కలవడానికి ట్రంప్ ఆసక్తిగా ఉన్నారన్న సెర్గియో గోర్
- డిసెంబర్‌లో జీ20 సదస్సు కోసం అమెరికా పర్యటనకు మోదీ
- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే సూచనలు
- 500 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం
- భారత్ విశ్వసనీయ రక్షణ భాగస్వామి అన్న గోర్

- మిగతా 2లో

## పుకెట్-ఢిల్లీ విమానంలో ప్రమాదం..
## డ్రగ్స్ తీసుకున్న పైలట్‌పై ఎయిరిండియా వేటు

- మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలిన పైలట్‌ను తొలగించిన ఎయిర్ ఇండియా
- పుకెట్-ఢిల్లీ విమానంలో తీవ్ర ఘటన అనంతరం ఈ చర్యలు తీసుకున్న సంస్థ
- ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందికి గాయాలయ్యాయి
- పైలట్‌పై చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ ప్రాథమిక నివేదికలో సిఫారసు
- భద్రత విషయంలో తమది జీరో టాలరెన్స్ విధానమని స్పష్టం చేసిన ఎయిర్ ఇండియా

- మిగతా 2లో



## దమ్ముంటే హరీశ్ రావు భార్య
# నాపై పోటీ చేయాలి

- తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్న కవిత
- తాను సీఎం కావాలని కోరుకుంటున్నానని వెల్లడి
- బీజేపీతో హరీశ్ రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపణ

- మిగతా 2లో




శ్రద్ధాంజలి



కీ॥శే॥ కప్పల మురళీ వెంకట బాల రామారావు (బాలు) గారు
Visakhapatnam Port Authority
(1970 - 2026)
(S/o. కప్పల జగ్గారావు (లేటు))

ప్రేమ, అనురాగం, ఆప్యాయతలను పంచి కుటుంబ శ్రేయస్సుకు, మా ఉన్నతికి
ఎంతగానో శ్రమించిన మీరు భౌతికంగా మా మధ్యన లేకపోయినా...
మీ మధుర జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా మదిలో పదిలం.
మీ ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని మనసారా కోరుకుంటూ...

కుటుంబ సభ్యులు

తల్లి : కప్పల అమ్మాజీ
భార్య : నిర్మల వెంకట లక్ష్మి
కుమార్తె : కప్పల కీర్తన షణ్ముఖి
కుమారుడు : కప్పల గణేష్ శ్రీ దత్త
మావయ్య : కొలిపాక కూర్మారావు
అత్తయ్య : కొలిపాక ఛాయాదేవి

కొలిపాక గంగాధర్ (లేటు)
కొలిపాక సూర్య కుమారి
కొలిపాక సాయి శ్రీ వంశీ
కొలిపాక అరవింద్
కొలిపాక మధు
కొలిపాక ఆశ్రిత

పెద్ద కర్మ : తేది 05-09-2026 స్థిరవారం మధ్యాహ్నం 12 గంటల నుండి
కళింగ ఫంక్షన్ హాల్, సీతమ్మధార, విశాఖపట్నం-2 నందు జరుపబడును.

# నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసుల 60 ఏళ్ల నిరీక్షణకు తెర

నెల్లూరు నగరంలో ఆరు దశాబ్దాలుగా నలుగుతున్న తీవ్రమైన సమస్యకు ఏపీప్రభుత్వం పరిష్కారం చూపింది. సర్వేపల్లి కాలువ కట్టపై నివసిస్తున్న సుమారు 1,215 నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాస హక్కు కల్పిస్తూ ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దశాబ్దాల తరబడి అభద్రతాభావంతో జీవిస్తున్న పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

**ఏళ్ల తరబడి ఎదురుచూపులు..**

గత 60 ఏళ్లుగా సర్వేపల్లి కాలువ కట్టపై వేలాది మంది నిరుపేదలు నివాసముంటున్నారు. అయితే, ఆ స్థలాలకు వారికి చట్టబద్ధమైన హక్కులు లేవు. కాలువ పోరంబోకు భూమి కావడంతో, ఎప్పుడు తమ నివాసాలు ఖాళీ చేయిస్తారోనన్న భయంతోనే వారు జీవనం సాగిస్తున్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చినా, అవి కార్యరూపం దాల్చలేదు. దీంతో అక్కడి ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**మంత్రి నారాయణ చొరవతో పరిష్కారం..**

ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారాయణ, ఈ దీర్ఘకాలిక సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కాలువ కట్ట వాసుల ఇబ్బందులను, వారి ఆవేదనను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఇటీవల భగత్ సింగ్ కాలనీ వాసుల సమస్యను పరిష్కరించిన స్ఫూర్తితో, ఈ అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.
కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, మొత్తం 62.70 ఎకరాల భూమిలో 22.31 ఎకరాలను కెనాల్ పోరంబోకు నుంచి 'ఏడబ్ల్యూ డ్రై'గా వర్గీకరణ మార్చేందుకు ఆమోదం తెలిపారు. ఈ ప్రక్రియలో కాలువ నిర్వహణ హక్కులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 1,215 కుటుంబాలకు అధికారికంగా ఇళ్ల పట్టాలు పొందేందుకు మార్గం సుగమమైంది.ప్రభుత్వ నిర్ణయం పట్ల మంత్రి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. 60 ఏళ్ల కలను నిజం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. కేబినెట్ నిర్ణయంతో సర్వేపల్లి కాలువ కట్ట వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిన సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## ఎడిటర్ వ్యూ

## తర్వాత వంతు ద్వారంపూడిదేనటగా.. వరస కేసులు రెడీ అవుతున్నాయా?

కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో నాటి విపక్ష పార్టీలపై విరుచుకుపడిన ద్వారంపూడి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఇటీవల పలు కేసుల్లో వైసీపీ నేతలు వరసగా అరెస్ట్ లు అవుతున్నారు. తర్వాత వంతు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిదేనన్న ప్రచారం ఊపందుకుంది. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో స్థానికంగా ఉన్న జనసేన కార్యకర్తలపై కూడా దాడులు చేయించారన్న ఆరోపణలున్నాయి. అలాగే అనేక భూ వివాదాలు, రేషన్ బియ్యం తరలింపు వంటి ఆరోపణలను ద్వారంపూడి ఎదుర్కొన్నారు. వాటిన్నంటిపై ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణలకు ఆదేశించింది.

**స్థానిక సంస్థల ఎన్నికలలోపేనా?**

స్థానిక సంస్థల ఎన్నికలలోపే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయన్న ప్రచారం పెద్దయెత్తున జరగుతుంది. ద్వారంపూడిపై విచారణలు, కేసులను ప్రభుత్వం వేగవంతం చేసింది.ద్వారంపూడిపై కూటమి ప్రభుత్వ చర్యలు ప్రారంభించింది.కాకినాడ పోర్టు భూముల కుంభకోణం, బియ్యం స్మగ్లింగ్ వంటి వ్యవహారాలపై ఆయనపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధమయినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనపై తదుపరి చర్యలు ఉంటాయనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. వరసగా విచారణలు ఒక్కొక్కటిగా పూర్తి కావస్తుండటం ద్వారంపూడిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేస్తుండటంతో నెక్స్ట్ టార్గెట్ ఆయనేనన్న టాక్ మాత్రం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తుంది.

**టీడీఆర్ బాండ్ల కుంభకోణం...**

కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి టీడీఆర్ బాండ్ల కుంభకోణం వివాదంలో చిక్కుకుని క్రిమినల్ విచారణను ఎదుర్కొంటున్నారు.టీడీఆర్ బాండ్ల వివాదం మరియు విజిలెన్స్ సిఫార్సులు చేసింది. కాకినాడలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు కోసం 23 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, కేవలం 4.66 ఎకరాలను మాత్రమే నకిలీ నోటిఫికేషన్‌తో అత్యవసరంగా సేకరించారన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఒక నిర్దిష్ట భూ యజమానికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి.ఈ భూమి ముళ్లపొదలతో, వినియోగానికి పనికిరాని లోతట్టు ప్రాంతంలో ఉన్నప్పటికీ టీడీఆర్ బాండ్లు జారీ చేశారనే విమర్శలున్నాయి.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. తనపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ద్వారంపూడి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

## ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం.. జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్

దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు.
వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి.ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది.ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# దమ్ముంటే హరీశ్ రావు భార్య నాపై పోటీ చేయాలి

తెలంగాణలో రాజకీయ ప్రత్యర్థుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర స్థాయికి చేరాయి. నూతనంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించిన కల్వకుంట్ల కవిత... బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ధైర్యముంటే హరీశ్‌రావు తన భార్యను తనపై పోటీకి దింపాలని బహిరంగ సవాల్ విసిరారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన కవిత... హరీశ్‌రావు నేరుగా బరిలోకి రాకుండా తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అవసరమని భావిస్తే రాజకీయాలను పక్కనపెట్టి ఆయన తన భార్యను బరిలోకి దించవచ్చని, ఆమె తనపై పోటీ చేసినా స్వాగతిస్తానని స్పష్టం చేశారు. గతంలో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటను గుర్తు చేసిన కవిత...
వచ్చే ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజక వర్గాల నుంచి పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు న్నట్లు సంకేతాలిచ్చారు.ఇదే సమయంలో ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను కవిత బహిరంగంగా వెల్లడించారు. తాను సీఎం కావాలని అనుకుంటున్నానని, ఆ పదవికి హుందాతనం, గౌరవం చాలా ముఖ్యమని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు.

## ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు..

జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు.
ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు.భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

**భారత స్థిరత్వం కీలకం**

భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు.

**రక్షణ బంధం మరింత బలోపేతం**

భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు.

**వరుస పర్యటనలతో బంధం బలోపేతం**

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

**క్వాడ్‌పై అమెరికా ప్రత్యేక ఆసక్తి**

భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.

# రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా పన్ను మినహాయింపు ఇచ్చుకున్నారా? అని ఆయన నిలదీశారు.

**గోదావరిని కమ్మేస్తున్న కాలుష్యం**

అధికారిక గణాంకాల ప్రకారమే రాజమండ్రి నగరంలోని మొత్తం కాలుష్యంలో సగం ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే వస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నగరం మొత్తం మీద రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, ఒక్క ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వెలువడుతున్నాయని వివరించారు. ఈ వ్యర్థ జలాల్లో ప్రమాదకర రసాయనాలు నిర్దేశిత పరిమితికి మించి ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. లాగూన్ల వద్ద సేకరించిన నీటి నమూనాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) లీటరుకు 36 మిల్లీగ్రాములుగా ఉందని, ఇది ప్రమాణాల కన్నా 20 శాతం అధికమని తెలిపారు. అదేవిధంగా ఫాస్ఫేట్ 6 శాతం, సల్ఫైడ్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.

**పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం**

పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గోదావరి నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని, నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, నీటి నాణ్యత క్షీణతతో ప్రజారోగ్యానికి హాని కలుగుతోందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. గతంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా, యాజమాన్యం పట్టించుకోలేదని గుర్తుచేశారు.

**ఇక ఉపేక్షించేది లేదు..**

నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం, జరిమానాలు విధించడం, కంపెనీని సీజ్ చేయడం, లైసెన్సును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అయితే, పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే సంకీర్ణ ప్రభుత్వం ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. గత మూడు నెలలుగా పీసీబీ అధికారులు సంస్థ ప్రతినిధులతో పలుమార్లు చర్చించినా స్పందన కరువైందని అన్నారు.
ఈ నేపథ్యంలో తక్షణమే సమన్లు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసేలా చూడాలని అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, ఇతర ప్రభుత్వ న్యాయవాదులకు సూచించారు. 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' నినాదంతో గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణవేత్తలు, పౌర సమాజం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## ఫుకెట్-ఢిల్లీ విమానంలో ప్రమాదం.. డ్రగ్స్ తీసుకున్న పైలట్‌పై ఎయిరిండియా వేటు

విమాన ప్రయాణికుల భద్రతను ప్రమాదంలోకి నెట్టిన ఓ పైలట్‌పై ఎయిర్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. మాదకద్రవ్యాల (సైకోయాక్టివ్ సబ్‌స్టాన్స్) పరీక్షలో పాజిటివ్‌గా తేలడంతో పైలట్-ఇన్-కమాండ్ (పీఐసీ)ని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించినట్లు శుక్రవారం ప్రకటించింది. ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలో తీవ్రమైన ఘటన చోటుచేసుకున్న అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం బయటపడింది.
భద్రతా నిబంధనల ఉల్లంఘన విషయంలో తమది "జీరో-టాలరెన్స్" విధానమని ఎయిర్ ఇండియా ప్రతినిధి స్పష్టం చేశారు. "ఫుకెట్-ఢిల్లీ విమాన పైలట్ మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలారు. భద్రత, ఫిట్‌నెస్ లేదా ఇతర నియంత్రణ నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోము. ఈ కారణంగా ఆ పైలట్ సేవలను తక్షణమే రద్దు చేశాం" అని ఆయన తెలిపారు.ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక దర్యాప్తు నివేదికను విడుదల చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పైలట్ డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలడం తీవ్రమైన ఆందోళన కలిగించే అంశమని, దీనిపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ తన నివేదికలో సిఫారసు చేసింది.

**ఏం జరిగింది?**

వివరాల ప్రకారం, ఆగస్టు 4న 137 మంది ప్రయాణికులు, ఆరుగురు క్యాబిన్ సిబ్బంది, ఇద్దరు పైలట్లతో కలిపి మొత్తం 145 మందితో ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం (ఏఐ-2379) ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. విమానం ఒడిశా గగనతలంలో 36,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా, దానిలోని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమయ్యాయి. దీంతో విమానం అదుపుతప్పి ఒక్కసారిగా 372 అడుగులు పైకి వెళ్లి, ఆ తర్వాత 292 అడుగులు కిందికి వచ్చేసింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయపడ్డారు.ఘటన అనంతరం ఢిల్లీలో ఇద్దరు పైలట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో ఇద్దరికీ నెగెటివ్ రాగా, మాదకద్రవ్యాల పరీక్షలో పీఐసీకి "నాన్-నెగెటివ్" ఫలితం వచ్చింది. అనంతరం నిర్ధారణ కోసం ఇద్దరి రక్త నమూనాలను ల్యాబొరేటరీకి పంపగా, పీఐసీ డ్రగ్స్ తీసుకున్నట్లు మరోసారి నిర్ధారణ అయింది. కో-పైలట్ ఫలితాలు మాత్రం నెగెటివ్‌గా వచ్చాయి. ఈ ఘటనపై సాంకేతిక, ఇతర అంశాలపై ఏఏఐబీ పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తోంది. విమానం బయలుదేరే ముందు నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి సమస్యలు లేవని నివేదిక పేర్కొంది.

## కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం...

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది.అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ద్రవ్యోల్బణం, లిక్విడిటీ ఒత్తిడి.. రెపో రేటు పెంపునకు సిద్ధమవుతున్న ఆర్బీఐ?

- మొదటి పేజి తరువాయి

రూపాయి నిధుల వల్ల ఏర్పడిన అదనపు లిక్విడిటీ మరోవైపు.. ఈ రెండింటి మధ్య భారత ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్టర్లు సంక్లిష్టమైన వాతావరణాన్ని ఎదుర్కొంటున్నారని నివేదిక విశ్లేషించింది. ఈ అదనపు నగదు ప్రవాహం కారణంగా ఓవర్‌నైట్ వడ్డీ రేట్లు, ఆర్బీఐ పాలసీ రేటు కంటే చాలా తక్కువ స్థాయికి పడిపోయాయని తెలిపింది. ఈ అసమతుల్యతను సరిదిద్దడానికి ఆర్బీఐ త్వరలోనే రంగంలోకి దిగాల్సి ఉంటుందని పేర్కొంది.ఈ పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి ఆర్బీఐ ఎంత వేగంగా చర్యలు తీసుకుంటుందన్న దానిపైనే భవిష్యత్తు ఆధారపడి ఉందని నివేదిక అభిప్రాయపడింది. ఓవర్‌నైట్ రేట్లను తిరిగి పాలసీ రేట్లతో అనుసంధానించడం, మధ్యకాలికంగా ఉన్న అదనపు లిక్విడిటీని తగ్గించడం, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని రెపో రేటు పెంపుపై ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయం తీసుకోవడం వంటి చర్యలు ఉంటాయని అంచనా వేసింది. ఎఫ్ఎక్స్ స్వాప్స్, ఎంఎస్ఎస్ బాండ్లు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) అమ్మకాలు, అవసరమైతే నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్) పెంపు వంటి చర్యలను మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయని తెలిపింది.మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో ఇంధన ధరలు పెరగడం, వ్యవసాయ ఉత్పత్తులతో సహా ఇతర కమొడిటీల ధరల్లో ఒత్తిడి వంటి అంతర్జాతీయ అంశాలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తున్నాయని నివేదిక గుర్తు చేసింది. దీనికి తోడు, దేశంలో రుతుపవనాలు అస్తవ్యస్తంగా ఉండటం, జీడీపీ వృద్ధి బలంగా నమోదు కావడం, రుణ వృద్ధి సుమారు 18 శాతంగా ఉండటం వంటి స్థానిక పరిస్థితులు కూడా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను పెంచుతున్నాయని వివరించింది.ఇప్పటివరకు వెలువడిన గణాంకాలు ఆర్బీఐకి కొంత ఊరటనిచ్చినప్పటికీ, ఇటీవలి ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశపు మినిట్స్.. సభ్యుల వైఖరి కఠినంగా మారుతోందనడానికి సంకేతమని నివేదిక అభిప్రాయపడింది. ప్రపంచవ్యాప్తంగా ధరల ఒత్తిళ్లు మరింత తీవ్రమవుతున్న తరుణంలో, ప్రస్తుత పాలసీ వైఖరిపై ఎంపీసీ సభ్యులలో అసౌకర్యం పెరుగుతోందని అంచనా వేసింది.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# ఘనంగా శ్రీ కృష్ణాష్టమి మహోత్సవములు



**దొనకొండ సెప్టెంబర్ 4 పెన్ పవర్**

మండల కేంద్రంలోని విరాట్ నగర్ లో గల శ్రీ ఆనంద ఆశ్రమంలో శ్రీ కృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని దొనకొండ శ్రీ ఆనంద ఆశ్రమంలో వేంచేసియున్న శ్రీకృష్ణ పరమాత్మకు ఉదయం 6 గంటల నుండి ఆశ్రమ అర్చకులు మణి బాబు శర్మ మహన్యాస పూర్వక గణపతి పూజ కలశ స్థాపన స్వామివారికి పంచామృతాలతో అభిషేకములు చేసి ప్రత్యేక అలంకరణ చేసి శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి సహస్రనామార్చనలు భగవద్గీత పారాయణం గోపూజ నిర్వహించి పొంగలి మహా నైవేద్యం సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు వచ్చిన భక్తులకు శ్రీ భైరవానంద స్వామి తీర్థప్రసాదాలు అల్పాహారం ఏర్పాటు చేశారు.

# వేణుగోపాల స్వామి ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు..

## వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి.

## కమణీయంగా శ్రీ కృష్ణ ,రుక్మిణి కళ్యాణం

## దండలు మార్చిడిలో ఘనంగా నృత్యం చేసి అబ్బురపర్చిన అశోక్





**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 4**

గిద్దలూరు పట్టణంలోని సుందర శిల్పాకళా సౌదర్యంతో అలరారుతున్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభాసంతరించుకోగా ఉత్సాహంతో నిర్వహించారు. ఈ వేడుకలకు గిద్దలూరు శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కి ఆలయ కమిటీ సభ్యులు ఆలయమర్యాదలతో పూర్ణకుంభం తో మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ గర్భగుడిలో శ్రీ వేణుగోపాలస్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతి తీర్థప్రసాదాలు స్వీకరించారు . అంతరం ఎమ్మెల్యే కు, అర్చకుల శేషవస్త్రం బహుకరించి వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయంలో కనులపండువగా కమణీయంగా స్వామివారి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాల్గొని, భక్తులతో కలిసి దివ్య లీలా కళ్యాణాన్ని తిలకించారు. కళ్యాణం లో దండలతో చేసే నృత్యం అశోక్ రెడ్డి అర్చకులతో సమానంగా చేసి భక్తులను అబ్బుర పర్చారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి పవిత్ర పర్వదినాన స్వామివారి వేడుకలు , కళ్యాణోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. శ్రీకృష్ణ భగవానుని దివ్య ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, నియోజకవర్గం అన్ని రంగాల్లో సుభిక్షంగా విలసిల్లాలని ఆకాంక్షించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, అన్న వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షులు చల్లా బాల నరసింహులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, గుంటక కొండయ్య, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలను దిగ్విజయం చేశారు.

# అన్ని చెరువులనూ సాగర్ నీటితో నింపాలి

## తాగునీటికి ఇబ్బంది లేకుండా 4 నెలల నిల్వలు తప్పనిసరి

## అధికారులతో రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) సెప్టెంబర్ 4:**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ ఆదేశించారు. అద్దంకి నియోజకవర్గం, సంతమాగులూరు మండలం, పుట్టావారిపాలెంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎన్ఎస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అందుబాటులో ఉన్న నాగార్జున సాగర్ జలాలను అత్యంత సమర్ధవంతంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తాగునీటికి ఎటువంటి కొరత రాకుండా కనీసం నాలుగు నెలలకు సరిపడా నిల్వలను సిద్ధం చేసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని నోటిఫైడ్, అన్‌నోటిఫైడ్ చెరువులతో పాటు నీటి గుంటలను సైతం సాగర్ జలాలతో పూర్తిస్థాయిలో నింపాలన్నారు. చెరువులు, కాలువల్లోని నీరు ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా కాకుండా చూడాలని, సాగర్ నీటిని అక్రమంగా బయటకు తరలించకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన చోట్ల మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేసి చెరువులకు చేర్చాలని, అవసరమైన మరమ్మతులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**కాలువల పర్యవేక్షణ, తాగునీటిపై ప్రత్యేక దృష్టి...**

అద్దంకి బ్రాంచ్ కెనాల్, మెయిన్ కెనాల్, దర్శి బ్రాంచ్ కెనాల్, ఒంగోలు బ్రాంచ్ కెనాల్‌లకు ప్రస్తుతం విడుదలవుతున్న నీటి వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన ప్రాంతాలకు నీటి విడుదలను పెంచేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన సిబ్బంది, యంత్రాంగాన్ని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భవిష్యత్ అవసరాలకు సరిపడా నీటిని సంరక్షించాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎన్ఎస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వాన జాడలేక.. రైతు నోట మాట లేక..!

**ఆకు నల్లబడితే.. అన్నదాత గుండె నల్లబడ్డట్టే**

**చేతికొచ్చే దశలో మిర్చి ఆకుకు నల్లమచ్చల తెగులు**

**వరి పొలాలు ఎండిపోయి బీటలు**

**వెలుగొండ జలాలపైనే ఇప్పుడు రైతుల ఆశ**

**పొగాకు నారుమడికి తేమ కరువు**

**రైతుల కష్టాలపై 'పెన్ పవర్' గ్రౌండ్ రిపోర్ట్**

**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4**

పొలాన్ని నమ్ముకున్న అన్నదాత కంట నీరు పెడుతున్నాడు. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో ఎల్-నినో ఎఫెక్ట్ రైతుల పాలిట శాపంగా మారింది. పెన్ పవర్ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించగా కనిపించిన దృశ్యాలు హృదయ విదారకం. చేతికొచ్చే దశలో ఉన్న మిర్చి పంట ఆకులకు నల్లమచ్చల తెగులు సోకి పంట ఎదుగుదల ఆగిపోయింది. నీరు లేక వరి పైరు కళ్ల ముందే ఎండిపోయి బూడిదవుతోంది. వచ్చే నెలలో వేయాల్సిన పొగాకు పంటకు నారుమడి వేసేందుకు కూడా భూమిలో చుక్క తేమ లేక రైతు దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.

**బంగారం తాకట్టు పెట్టి మిర్చి వేశా.. ఇప్పుడు ఆకుకు నల్లమచ్చ..**

మండలంలోని రైతు శ్రీను కథ ఇది. భార్య బంగారం తాకట్టు పెట్టి మూడు ఎకరాల్లో మిర్చి వేశాడు. ఎకరాకు రూ.1.20 లక్షల నుండి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. ప్రతి మొక్కను బిడ్డలా సాకా సార్. మందు కొట్టడానికి నా రక్తం చెమటగా మారింది అంటూ ఆకును చేతిలోకి తీసుకున్నాడు. ఆకు నిండా నల్లటి మచ్చలు. ఆకుకు మచ్చలు రావడంతో మొక్క పెరుగుదల ఆగిపోయింది, పూత కూడా రావడం లేదు. కాయ ఇంకా రాలేదు కానీ, ఆకు నల్లబడితే కాయ ఎక్కడ కాస్తుందయ్యా అని కన్నీరు పెడుతున్నాడు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి. మార్కాపురం, పొదిలి, తర్లుపాడు, దర్శి, కొనకనమిట్ల మండలాల్లో 40 వేల ఎకరాల్లో వేసిన మిర్చి పంట ఆకులకు ఈ తెగులు పట్టుకుంది.

**వరి పొలం కాదు.. అది ఎడారి..**

వరి రైతు పరిస్థితి మరీ దయనీయం. కాలువకు, నీరు రాలేదు. చెరువుల్లో చుక్క నీరు లేదు. బోర్లలో 800 అడుగుల్లో కూడా నీరు లేదు. ఆరుద్రలో ముచ్చటపడి నాటిన వరి, పాలు పోసుకోవాల్సిన దశలో ఎండిపోయింది.

**పొగాకు రైతుకు ఇప్పుడు నిద్ర కరువు...**

మార్కాపురం అంటేనే పొగాకు. వచ్చే నెల అక్టోబర్ చివరి వారం నుండి నాట్లు మొదలవ్వాలి. ఇప్పుడు నారుమడులు పోయాల్సిన సమయం. కానీ నేలలో తేమ శాతం 0%. విత్తనం వేసేందుకు వాన దేవుడు కరుణించడం లేదు. వేలాది మంది కౌలు రైతులు, కూలీలు పొగాకు మీదే ఆధారపడి బతుకుతారు.

**వెలుగొండ జలాలపై రైతుల ఆశలు..**

అయితే ఇటీవల ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టుకు జలాలు విడుదల చేయడంతో రైతుల్లో కొత్త ఆశ చిగురించింది. ఈ జలాలతో భూగర్భ జలాలు పెరిగి, తమ బోర్లలో నీరొచ్చి, భూమిలో తేమ వస్తుందేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వెలుగొండ నీరు తమ పొలాలకు చేరకున్నా, కనీసం భూమిలో తేమ వస్తే చాలు పొగాకు నారుమడి వేసుకోవచ్చని రైతులు దేవుడిని మొక్కుకుంటున్నారు. ఇప్పుడు మార్కాపురం రైతు కళ్లన్నీ వెలుగొండ వైపే ఉన్నాయి.

**ప్రభుత్వం ఆదుకోవాలి..**

అధికారులు వచ్చి పొలం చూడాలి. పంట నష్టాన్ని అంచనా వేయాలి. ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి మమ్మల్ని అప్పుల ఊబి నుండి కాపాడాలి" అని రైతులు వేడుకుంటున్నారు.

# 150 మెడికల్ క్యాంపులు పెడదాం

## - వైద్యులందరూ కలిసి రావాలని కలెక్టర్ పిలుపు





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు సెప్టెంబర్ 04**

ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా ఈనెలలో 150 మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. నగరంలోని వైద్యులందరూ కూడా వీటిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో నగరంలోని డాక్టర్ లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు నగరం విస్తరిస్తున్న తీరు, భవిష్యత్తు అవసరాలను తీర్చేలా నగరాన్ని అభివృద్ధి చేసే విధానాన్ని వివరించారు. ఈ 150 ఏళ్ల వేడుకలలో ఈ దిశగా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా వైద్యరంగానికీ ప్రాధాన్యము ఇస్తున్నట్లు స్పష్టంగా చేశారు. వివిధ సేవలు అందిస్తున్న ఆస్పత్రులన్నీ ఒకేచోట ఉండేలా మెడికల్ హబ్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. వైద్యులు కూడా ఒంగోలు నగర విశిష్ట వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్ళడంలో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సేవలను విస్తృతం చేయాలని, మెడికల్ క్యాంపుల నిర్వహణకు సహకరించాలని కోరారు. ప్రముఖ వైద్యులు, పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ నగర అభివృద్ధిలో, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు కూడా తమ వంతు బాధ్యత నిర్వహిస్తారని ఈ సందర్భంగా ప్రకటించారు. వైద్యులు మాట్లాడుతూ మెడికల్ హబ్ ప్రతిపాదనను స్వాగతించారు. మెడికల్ క్యాంపుల నిర్వహణలోనూ సహకరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఐఎంఏ అధ్యక్షులు నాగయ్య నాయుడు, డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

# వెలుగొండ నీళ్లపై వైసీపీ విషపు రాజకీయం..!

## పండుగ చేసుకుంటున్న మార్కాపురం ప్రజలు

## ప్రాంతీయ చిచ్చు పెడుతున్న వైసీపీ నేతలు

## 23 లక్షల మంది గొంతు తడిపే ప్రాజెక్టుపై కూడా కుట్రలా?

## ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఫైర్




**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4**

వెలుగొండ ప్రాజెక్టుకు నీటి విడుదలతో మార్కాపురం ప్రాంత ప్రజలు పండుగ చేసుకుంటుంటే, ఏమీ తోచని వైసీపీ నాయకులు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మండిపడ్డారు.స్థానిక జవహర్ నగర్ లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రాయలసీమకు నీటి విడుదల చేసినప్పుడు మేము సంతోషించమన్నారు.. ఆ ప్రాంతం కూడా వెనుకబడింది కాబట్టి. అలాగే దేశంలోనే అత్యంత వెనుకబడిన జిల్లా తాగు నీటి కోసం, నాయకుడు చంద్రబాబు నాయుడు ముందుచూపుతో వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేసామన్నారు. దీంతో 23 లక్షల మంది గొంతు తడుస్తుందని,ఇది గమనించకుండా దీనిపై కూడా వైసీపీ నేతలు రాజకీయం చేస్తున్నారాని మండిపడ్డారు.చివరకు తెలంగాణ నాయకులతో కుమ్మక్కై ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నారని అని ఎమ్మెల్యే ఆరోపించారు. క్యాబినెట్ సమావేశంలో కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా నూతన కలెక్టరేట్ నిర్మాణం కోసం 20.20 ఎకరాలను కేటాయించారని, త్వరలోనే కలెక్టరేట్ నిర్మాణం చేపడతామని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని, ప్రజలకు వాస్తవాలు తెలుసని అన్నారు. మార్కాపురం ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన వెలుగొండ ప్రాజెక్టు పూర్తితో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెంకటరెడ్డి, మల్లికార్జున,తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# కక్ష సాధింపు తెలియని వేమిరెడ్డి దంపతులు -గోచిపాతల మోషే

**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 4**



నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేద ప్రజలకు సేవ చేయడం తప్ప రాజకీయంగా ప్రతిపక్ష పార్టీ నాయకులు , కార్యకర్తల మీద కక్ష సాధింపు చర్యలు చేపట్టడం తెలియదని ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే అన్నారు. వేమిరెడ్డి దంపతుల మీద ఉద్దేశపూర్వకంగా అవాస్తవాలు మాట్లాడటం మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కు అలవాటుగా మారిందని మోషే ఎద్దేవా చేశారు. వేమిరెడ్డి దంపతులను రాజకీయంగా ఎదుర్కోలేక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని , ఇకనైనా నీతిమాలిన రాజకీయాలు మానుకోకపోతే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మోషే హెచ్చరించారు.

# దివ్యాంగురాలికి ట్రై సైకిల్ ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 04**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో నల్లబండ బజారుకు చెందిన దివ్యాంగురాలైన మీసాల శ్రీదేవికి శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి స్వయంగా ట్రై సైకిల్‌ను అందజేశారు.

ఇటీవల నల్లబండ బజారులో నిర్వహించిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఇంటింటికి వెళ్లగా దివ్యాంగురాలైన శ్రీదేవి తన దైనందిన కష్టాలను వివరిస్తూ ట్రై సైకిల్ కావాలని కోరారు. ఆమె సమస్య పై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే, ట్రై సైకిల్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద ఆమెకు నూతన ట్రై సైకిల్‌ను పంపిణీ చేశారు. తన కష్టాన్ని, అవసరతను గుర్తించి తనకు ట్రై సైకిల్ అందచేసిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కి శ్రీదేవి వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఉచిత మంచినీటి ట్యాంకర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల..



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 04**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఉచిత మంచినీటి ట్యాంకర్ ను ప్రారంభించారు.. వర్షాభావ పరిస్థితుల వల్ల గిద్దలూరు పట్టణంలో ఏర్పడిన తాగునీటి సమస్య పరిష్కారానికి, గిద్దలూరు మండలం, కంచిపల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకులు దప్పిలి శ్రీనివాసరెడ్డి ముందుకు వచ్చి తన వంతు సహకారంగా ఉచితంగా ఒక మంచినీటి ట్యాంకర్ ను ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తన వంతు సహకారం అందించిన దప్పిలి శ్రీనివాసరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు.. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో దళిత సేవ ఫౌండేషన్ కార్యవర్గ సమావేశం

**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 4,**

పొదిలిలో దళిత సేవ ఫౌండేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో దళిత సేవా ఫౌండేషన్ నాయకులు వివిధ అంశాల గురించి చర్చించారు. అలాగే వాటికి సంబంధించిన పలు నిర్ణయాలను కూడా వారు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం జిల్లా నాయకులు మోటా పవన్ కుమార్, కిన్నెర కోటేశ్వరమ్మ ఇన్చార్జిలుగా వ్యవహరించారు. సమావేశంలో ఆ సంఘానికి చెందిన పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# టీడీపీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణకు ఘన స్వాగతం

## -ఎమ్మెల్యే ఇంటూరి ఆధ్వర్యంలో సత్కారం

## -నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన ఎమ్మెల్యే

**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 4:**

భాష్యం విద్యాసంస్థల అధినేత, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ శుక్రవారం కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆయనకు సాదర స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావుతో పాటు పార్టీకి చెందిన పలువురు నాయకులను రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ కి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరిచయం చేశారు. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ, అభివృద్ధి అంశాలపై ఇరువురు నేతలు పరస్పరం చర్చించారు.కందుకూరు నియోజకవర్గంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే నాగేశ్వరరావు రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ కి వివరించారు. ముఖ్యంగా నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ



కార్యక్రమాల గురించి వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు రూరల్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి టిడిపి నాయకులు చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్,



ముచ్చు శ్రీనివాసరావు, ముప్పవరపు వేణు, ఉన్నం వీరస్వామి, సవిడి బోయిన వెంకటకృష్ణ, పులి నాగరాజు తదితరులు భాష్యం రామకృష్ణ ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# సైబర్ సెక్యూరిటీలో విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ

## -ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల వర్క్‌షాప్ విజయవంతం



**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 4**

నేటి డిజిటల్ యుగంలో సైబర్ భద్రతపై అవగాహనతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో నిర్వహించిన మూడు రోజుల "సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్" వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్‌కు చెందిన టీచ్ పీక్ సంస్థతో అనుబంధం కలిగిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు పి. కార్తీక్ కుమార్ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, వెబ్ అప్లికేషన్ సెక్యూరిటీ, పెనిట్రేషన్ టెస్టింగ్ తదితర అంశాలపై సిద్ధాంతంతో పాటు హ్యాండ్స్-ఆన్ ట్రైనింగ్ అందించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విలువైన అవగాహనతో పాటు ప్రాక్టికల్ అనుభవాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, "నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడమే మా లక్ష్యం. తరగతి గది బోధనకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించే ఇలాంటి శిక్షణా కార్యక్రమాలకు కళాశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంది" అని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, "అకడమిక్స్‌తో పాటు ఆధునిక టెక్నాలజీలపై అవగాహన, ప్రాక్టికల్ అనుభవం ఉన్నప్పుడే విద్యార్థులు పోటీ ప్రపంచంలో విజయవంతంగా రాణించగలరు. ఇటువంటి వర్క్‌షాప్‌లు వారి భవిష్యత్ కెరీర్‌కు బలమైన పునాది వేస్తాయి" అని పేర్కొన్నారు. సీఎస్ఈ (సీఎస్) విభాగాధిపతి డా. కె. సుబ్బారెడ్డి మాట్లాడుతూ, "సైబర్ సెక్యూరిటీ నేటి అవసరం మాత్రమే కాదు... భవిష్యత్ ప్రపంచానికి అత్యంత కీలకమైన రంగం. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రొఫెషనల్స్‌గా ఎదిగేందుకు అవసరమైన అవగాహనను పొందారు" అని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వర్క్‌షాప్‌ను విజయవంతం చేశారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కు ఎంపిక

## హెచ్ఎం చెన్నకేశవుల భాస్కర్ నాయుడు

**పెన్ పవర్ ,కంభం సెప్టెంబర్ 4**

జిల్లాలో ఉత్తమ గురువులుగా ఎంపికైన వారిలో ఎంపీపీ ఎస్ ఎన్ ఆరు తురిమెళ్ళ ప్రధానోపాధ్యాయుడికి రెండోసారి జిల్లా స్థాయి గుర్తింపు దక్కింది. కంభం మండలంలోని ఎంపీపీఎస్ ఎన్ఆర్ తురిమెళ్ళ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్నకేశవుల భాస్కర్ నాయుడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా కంభం మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఆయన విద్యా సేవలను ప్రశంసిస్తున్నారు. విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ పాఠశాలలో వినూత్న బోధనా విధానాలను అమలు చేస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారి స్థాయికి అనుగుణంగా బోధించడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడం, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవడం వంటి కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొంటారు. పాఠశాల నిర్వహణలో క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన కార్యాచరణకు ప్రాధాన్యం ఇస్తూ ఉపాధ్యాయులు,



విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సృజనాత్మకత, నైతిక విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో చర్యలు చేపడుతున్నారు. సహచర ఉపాధ్యాయులతో సమన్వయంగా పనిచేస్తూ పాఠశాల కార్యకలాపాల్లో మార్గదర్శక పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు సహచరులతో సౌమ్యంగా వ్యవహరిస్తూ విధి నిర్వహణలో నిబద్ధత చూపుతున్నారు. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. తాజాగా ఏర్పడిన మార్కాపురం జిల్లా నుంచి మరోసారి అదే స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. రెండు వేర్వేరు సందర్భాల్లో జిల్లా స్థాయి అవార్డులు అందుకోవడం ఆయన సేవలకు లభించిన గుర్తింపుగా విద్యావర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అవార్డు కంభం మండలానికి గౌరవంగా నిలిచిందని విద్యావేత్తలు ఉపాధ్యాయులు తెలిపారు.

# శ్రీగిరిలో భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

## వరలక్ష్మి వ్రతంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు సెప్టెంబర్ 04**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి / గోకులాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని గోపూజ నిర్వహించడంతోపాటు శ్రీవారికి 21 రకాల ప్రసాదాలను నివేదన చేశారు. ఏడుగురు యాదవ రాజులను సన్నిధి గొల్లలు నరసింహారావు , శ్రీనివాసరావు, చావలి రాజేష్, ఆంజనేయులు, జడ హర్షిల్,శ్యాం కుమార్ , రాజా ధన వర్మలను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు ఘనంగా సన్మానించారు.

**శుభములిమ్ము వరలక్ష్మి:**

శ్రావణ మాసం చివరి శుక్ర వారాన్ని పురస్కరించుకుని శ్రీ గిరి దేవస్థానంలో మహిళలచే సామూహిక కుంకుమార్చన (వరలక్ష్మి వ్రతం) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద



సంఖ్యలో పాల్గొన్నారు. పూజకు అవసరమైన వస్తు సామాగ్రిని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులే ఉచితంగా సమకూర్చారు. శ్రీగిరి దేవస్థానం వేద పండితులు భాను ప్రకాష్ శర్మ మహిళల చేత వరలక్ష్మి వ్రతం నిర్వహింప చేశారు. సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు మహాలక్ష్మి అమ్మవారి రూపులను ప్రసాదాలను అందజేశారు. వరలక్ష్మి మాత తమకు ఆయురారోగ్య ఐశ్వర్య భాగ్యాలను, ముత్తయిదుతనాన్ని అనుగ్రహించాలని మహిళలు అమ్మవారిని ప్రార్థించారు.

# విశ్రాంత ఉద్యోగుల నిరసన




**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 04**

ఏపీ జేఏసీ అమరావతి పిలుపుమేరకు గిద్దలూరు విశ్రాంతఉద్యోగ సంఘ కార్యాలయం దగ్గర సంఘ సభ్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో సభ్యులు మాట్లాడుతూ 12వ పిఆర్సి కమిషన్ నియమించాలని ఐఆర్ ప్రకటించాలని బకాయి ఉన్న ఐదు డిఏలు మంజూరు చేయాలని క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలని పాత బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు . మార్కాపురం జిల్లా ఉపాధ్యక్షుడు బి పాండు మార్కాపురం జిల్లా సహాధ్యక్షుడు ఎం భాస్కర్ రెడ్డి , పి శివారెడ్డి, సూరే కొండయ్య, పి తిమోతి, ఎస్ సుబ్రమణ్యం దమ్మాల హరి ప్రసాద్. పి వి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో మెడికల్ ఏజెన్సీ ప్రారంభించిన ఎస్ ఐ రాజేష్



**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 4**

పొదిలిలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ ఏజెన్సీ షాపును పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ సూరెడ్డి రాజేష్ ప్రారంభించారు. శుక్రవారం నాడు పట్టణంలోని చిన్న బస్టాండ్ సెంటర్లో దివంగత పొదిలి ఏ ఎస్ ఐ. కె శ్రీనివాసరావు కుమారులు చంద్రసాయి కిరణ్, అభినాష్ ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన దుకాణాన్ని ఎస్ ఐ రాజేష్ తన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ రాజేష్ మాట్లాడుతూ దివంగత ఏ ఎస్ ఐ శ్రీనివాసరావు పోలీస్ శాఖకు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన కుమారులు ఏర్పాటు చేసిన మెడికల్ ఏజెన్సీ వ్యాపారం అన్ని విధాల సజావుగా సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రిటైర్డ్ డి.ఎస్.పి విజయసారథి, పొదిలి ఏ ఎస్ ఐ సత్యనారాయణ, పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్, న్యాయవాది షేక్ షబ్బీర్, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష తోపాటు పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లింలకు బియ్యం పంపిణీ

**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ సెప్టెంబర్ 04**

ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ ఎకనామికల్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో స్థానిక వారి సంఘ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న కార్యక్రమం లో భాగంగా సొసైటీ సభ్యులు నిరుపేద కుటుంబాలకు చెందిన ఒక్కొక్క ముస్లిం కుటుంబానికి 25 కేజీలు చొప్పున బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాలకు ప్రకాశం జిల్లా లో దాతలు ఎవరైనా ఉన్నచో ముందుకు వచ్చి తమవంతు సాయం చేయవలసిందిగా జిల్లా కమిటీ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్ వలి కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



# కృష్ణాష్టమి సంబరాలతో కళకళలాడిన ప్రకాశం కళాశాల






**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 4**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో నిర్వహించిన వేడుకలు ఆధ్యాత్మికత, సంప్రదాయం, విద్యార్థుల ఉత్సాహం కలగలిసి కనులపండువగా సాగాయి. కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో లెమన్ అండ్ స్పూన్ రేస్, మ్యూజికల్ చెయర్స్, టగ్ ఆఫ్ వార్, ఉట్టి కార్యక్రమం, కోలాటం తదితర పోటీలు సందడిగా జరిగాయి. ముఖ్యంగా కొత్తగా కళాశాలలో చేరిన ఫ్రెషర్స్ ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కోలాటం ప్రదర్శన ప్రేక్షకులను అలరించగా, ఉట్టి కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు, కళాశాల శ్రేయోభిలాషులందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. "శ్రీకృష్ణుడు జ్ఞానం, ధైర్యం, నాయకత్వం, ధర్మం, సమయస్ఫూర్తికి ప్రతీక. ప్రతి విద్యార్థి ఆయన జీవితంలోని విలువలను ఆదర్శంగా తీసుకుని విద్యతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని, నైతిక విలువలను అలవర్చుకోవాలి. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే గొప్ప వేదికలు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని పెంపొందిస్తాయి. విద్యతో పాటు సంస్కారాలను అందించడమే ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల లక్ష్యం" అని అన్నారు. ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, "విద్యార్థుల సమగ్ర వికాసానికి ఇలాంటి సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయి. ప్రతి విద్యార్థి ఉత్సాహంగా పాల్గొనడం ఆనందదాయకం" అని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులందరికీ స్వీట్లు పంపిణీ చేసి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌చార్జి మీరవలి, డా. కె. పవని, డా. ఎస్.కె. సురియా షిహాబ్, డా. జి. ప్రసాద్ తో పాటు ఎస్ హెచ్ విభాగ అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతంగా సమన్వయం చేశారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా లక్ష్మీనారాయణ, నరసయ్య




**సి ఎస్ పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 4**

మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం పట్ల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని వి.బైలు పాఠశాలలో పనిచేస్తున్న జి. లక్ష్మీనారాయణ, నల్లమడుగుల పాఠశాలలో పనిచేస్తున్న ఆర్.పి. నరసయ్యలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు జె. ప్రసాదరావు, బూదాల డేవిడ్, యూటీఎఫ్ అధ్యక్షులు కె. నాగరాజు, ప్రధాన కార్యదర్శి కుండా వెంకటేశ్వర్లు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ జె. వెంకట్రావు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారి విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం ఎంతో ప్రోత్సాహకరమన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన లక్ష్మీనారాయణ, నరసయ్యలు మరింత బాధ్యతతో పనిచేసి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు.

## ఎన్ఎస్పి కాలవపై ఎడ్యుకేట్ ఇంజనీర్ ఆకస్మిక తనికిలి

### పసుమర్రు మేజర్ పై చెరువులను తనిఖీ చేసిన ఎడ్యుకేట్ ఇంజనీర్ సతీష్ చంద్ర



**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 04**

సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు 26వ మైలురాయి వద్ద సతీశ్ చంద్ర శుక్రవారం పసుమర్రు మేజర్ పై పరిశీలన చేయడం జరిగింది. 26 వ మైలు 0%0 నుండి 16 కిలోమీటర్ల పరిశీలన తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎగ్జిక్యూట్ ఇంజనీర్ సతీష్ చంద్ర మాట్లాడుతూ ఉప్పుమాగులూరు, సజ్జాపురం, చెన్నుపల్లి, మక్కెనవారిపాలెం గ్రామాలకు సంబంధించిన మంచినీటి చెరువులను తనిఖీ చేయడం జరిగిందని ప్రస్తుతం వస్తున్న సాగర్ జలాలతో 90 శాతం అన్ని చెరువులలో నీరు నింపడం పూర్తి అవ్వడం జరిగిందని నీరు వృధాగా పోకుండా తగిన చర్యలు తీసుకున్నామని క్షేత్రస్థాయి నుంచి ఎవరు శ్రద్ధ వహించకుండా చెరువులకు మాత్రమే మంచినీటిని అందించగలగడమే ప్రధానో లక్ష్యం అని సతీష్ చంద్ర తెలిపారు.

## బోధనా సేవలకు జిల్లా స్థాయి కిరీటం

### -2026 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మద్దినేని సునీత ఎంపిక



**వలేటివారిపాలెం, పెన్ పవర్ సెప్టెంబరు 4**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంకితభావంతో సేవలందిస్తున్న మద్దినేని సునీతకు ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. వలేటివారిపాలెం మండలం శింగమనేనిపల్లె ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను 2026 సంవత్సరానికి ప్రకాశం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు జిల్లా అధికారులు ఎంపిక చేసి ప్రకటించారు.

**2005లో ప్రారంభమైన ప్రస్థానం.. నేడు జిల్లా స్థాయి గుర్తింపు....**

మద్దినేని సునీత 2005 నవంబర్‌లో సీఎస్‌పురం మండలం ముండ్లపాడు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా తొలి పోస్టింగ్ పొందారు. అనంతరం 2009లో కలవళ్ల ప్రాథమిక పాఠశాలలో, 2017లో నలదలపూరు ప్రాథమిక పాఠశాలలో సేవలందించారు. 2025 నుంచి శింగమనేనిపల్లె ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. బోధనలో ప్రతిభ, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆమెకు ఇప్పటికే పలు పురస్కారాలు లభించాయి. 2022 మార్చిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సబ్‌కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎంపవరింగ్ ఉమెన్స్ అవార్డు--2022 అందుకున్నారు. అదేవిధంగా 2025లో వలేటివారిపాలెం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. అదే ఏడాది అక్టోబర్‌లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. తాజాగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంతో ఆమె ఉపాధ్యాయ ప్రస్థానంలో మరో ప్రతిష్ఠాత్మక మైలురాయి నమోదైంది.

**అభినందనల వెల్లువ...**

మద్దినేని సునీత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంపై ఆమెతో కలిసి పనిచేసిన సహచర ఉపాధ్యాయులు, వలేటివారిపాలెం మండలం ఎంఈఓ-1 మాల్యాద్రిరెడ్డి, ఎంఈఓ-2 మల్లికార్జున తదితరులు అభినందనలు తెలిపారు. తమ గ్రామంలోని పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు రావడం తమకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని శింగమనేనిపల్లె గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సునీత సాధించిన ఈ గుర్తింపు తోటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి...



**పుల్లల చెరువు పెన్‌పవర్ సెప్టెంబర్ 4**

పుల్లలచెరువు మండలం చెనంపల్లి గ్రామాన్ని ఎస్ఐ బి సాంబశివరావు సందర్శించి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, మహిళల భద్రత, పోక్సో చట్టం తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లను నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. అలాగే యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల భవిష్యత్తు నాశనం కావడంతో పాటు కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని హెచ్చరించారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసులను సంప్రదించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువత పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన దక్షిత, లాస్యశ్రీ వేషధారణ



**సి ఎస్ పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 4**

మండలంలోని పలు గ్రామాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సి ఎస్ పురం గ్రామానికి చెందిన దర్శి చిన్న కాశయ్య మనవరాళ్లు దక్షిత, లాస్యశ్రీలు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ముస్తాబై అందరి దృష్టిని ఆకర్షించారు. సంప్రదాయ దుస్తులు, ఆభరణాలు, ఆకట్టుకునే అలంకరణతో చిన్నారులు ముద్దుగా కనిపించడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కూడా ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. జన్మాష్టమి సందర్భంగా చిన్నారులను శ్రీకృష్ణుడు, రాధ, గోపికలుగా అలంకరించడం ప్రత్యేక వేషధారణల ద్వారా శ్రీకృష్ణుడి బాల్య లీలలు, గోకుల వాతావరణాన్ని గుర్తుచేసుకోవడంతో పాటు, చిన్నతనం నుంచే పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలపై దక్షిత, లాస్యశ్రీలు రాధాకృష్ణుల వేషధారణలో కనిపించడంతో వారిని చూసేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆసక్తి చూపారు. చిన్నారుల ముద్దుముద్దు మాటలు, చిరునవ్వులు అందర్నీ ఆకట్టుకున్నాయి చిన్ని కృష్ణయ్య బుజ్జి గోపికమ్మ చూడ ముచ్చటమ్మా అంటూ సంతోషం వ్యక్తం చేస్తూ అభినందిస్తూ ఆశీర్వదించారు ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందని పలువురు గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

## కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలి -ఏపీ రైతు సంఘం డిమాండ్



**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4**

ఎల్-నినో ప్రభావంతో వర్షాలు లేక కరువు ఏర్పడి రైతులు, కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం గాలి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు వేసిన అన్ని రకాల పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే ఆదుకోకుంటే రైతులు కోలుకునే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పంటలపై తీసుకున్న రెండు లక్షల రూపాయల వరకు రుణాలను రద్దు చేయాలని, పశువులకు పశుగ్రాసం అందించాలని కోరారు. రైతులు ఉచిత బీమా పథకం అమలు చేయాలని అడుగుతుంటే, పంటలు వేయకుండానే ఇన్సూరెన్స్ కట్టమని ప్రభుత్వం ప్రోత్సహించడం కంపెనీల ప్రయోజనం కోసమే తప్ప రైతుల ప్రయోజనం కోసం కాదని ఆరోపించారు. భవిష్యత్తులో రైతులకు ఇన్సూరెన్స్ రాకపోతే అధికారులు, ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. తిరుపతిరెడ్డి, ఊసా వెంకటేశ్వర్లు, నాయకులు వై. పాపిరెడ్డి, రామకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, నాగయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

### వెలుగొండ నిర్వాసితులను పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం

**యర్రగొండపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 4**

వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే నిర్వాసితులకు అండగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ హెచ్చరించారు. పెద్దారవీడు మండలం తోకపల్లి గ్రామంలో నివసిస్తున్న వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులను ఆయన శుక్రవారం పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలపై వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అత్యవసరంగా పరిష్కరించాలని ఆదేశించారు. నిర్వాసితులకు సంబంధించిన పట్టాల పంపిణీ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పునరావాస ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్వాసితులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. గత నాలుగు రోజులుగా పెద్దారవీడు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వాసితులకు భోజన సదుపాయం, మంచినీటి సరఫరా, ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీ, కూరగాయల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్వాసితులకు ఎలాంటి సమస్య వచ్చినా యర్రగొండపాలెం ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలని, తమ వంతుగా అన్ని విధాలా అండగా ఉంటామని తాటిపర్తి చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నలమల్ల అడవి వేట

### ఉడుమును వేటాడిన ముగ్గురు అరెస్ట్.

### న్యాయమూర్తి ముందు హాజరు కోర్టు రిమాండ్



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 04**

గిద్దలూరు డివిజన్ గుండ్లకమ్మ అటవీ రేంజ్ పరిధిలోని దిగువమెట్ట సెక్షన్‌లో ఉడుములను వేటాడిన కేసులో ముగ్గురు వ్యక్తులను అటవీ అధికారులు అరెస్ట్ చేశారు. దిగువమెట్ట గ్రామానికి చెందిన బండి నాగేంద్ర, బండి ప్రశాంత్, గిద్దలూరుకు చెందిన గరికపాటి అనిల్‌ను అదుపులోకి తీసుకుని గిద్దలూరు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. నిందితులకు మేజిస్ట్రేట్ 15 రోజుల రిమాండ్ విధించడంతో వారిని మార్కాపురం సబ్‌జైలుకు తరలించారు. ఉడుములు వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం షెడ్యూల్-1లో అత్యంత రక్షణ కల్పించిన వన్యప్రాణుల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ఉడుములను వేటాడటం, చంపడం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందని పేర్కొన్నారు. ఉడుములు అటవీ ప్రాంతాలతో పాటు వ్యవసాయ పొలాలు, నివాస ప్రాంతాల్లోనూ సంచరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు వాటిని చూసి భయాందోళనలకు గురికాకుండా, వాటికి ఎలాంటి హాని చేయకుండా వెంటనే స్థానిక అటవీ అధికారులకు సమాచారం అందించాలని గుండ్లకమ్మ రేంజ్ అటవీ క్షేత్రాధికారి కోరారు.

# వేణుగోపాలస్వామి లడ్డును రూ.20,116

## వరుసగా మూడో ఏడాది వేలంలో కైవసం చేసుకున్న బొనేని వెంకటేశ్వర్లు యాదవ్

**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 4**

వేణుగోపాలస్వామి దేవాలయంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్. బొనేని వెంకటేశ్వర్లు రూ.20,116లకు లడ్డూను సొంతం చేసుకున్నారు. గిద్దలూరు లోని వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం కృష్ణాష్టమి పర్వదిన సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో వరుసగా మూడో ఏడాది కూడా లడ్డూ వేలంలో బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొని గెలుపొందడంతో ఆయన హ్యాట్రిక్ సాధించినట్లు అయింది. వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం నుంచి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అన్నదానం ముగిసిన తర్వాత ఉట్టి కొట్టే కార్యక్రమానికి ముందు స్వామివారి లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో మార్కెట్ యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, ఆదర్శ పాఠశాల చైర్మన్ బుడత తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. భక్తులు,



స్థానికులు ఉత్సాహంగా వేలం పాటను తిలకించారు. వేలం పాటలో బొనేని వెంకటేశ్వర్లు రూ.20,116లకు లడ్డూను దక్కించుకున్నారు. వరుసగా మూడో సంవత్సరం స్వామివారి లడ్డూను సొంతం చేసుకోవడం



పట్ల ఆయన అనుచరులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడిగా కందుల విజయ్ కుమార్

## విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తుల హర్షం



**పెన్ పవర్ తర్లుపాడు సెప్టెంబర్ 4**

తర్లుపాడు మండలం, కలుజువ్వలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు కందుల విజయ్ కుమార్ మండల ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడం పట్ల సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు, క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పిస్తూ పాఠశాల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించి మండల విద్యాశాఖ ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన విజయ్‌కుమార్ కి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హృదయపూర్వక అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ విజయ్ కుమార్ పాఠశాలకే వన్నె తెచ్చారని, ఆయన సేవలు మరెన్నో పురస్కారాలు అందుకునేలా కొనసాగాలని ఆకాంక్షించారు.

# మిట్టపాలెంలో రెండు బంకుల్లో చోరీ

## సంఘటన ప్రదేశాన్ని పరిశీలించిన ఎస్సై వెంకటేశ్వర్‌రెడ్డి



**సి ఎస్ పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 4**

మండలంలోని మిట్టపాలెం గ్రామంలో గురువారం రాత్రి రెండు బంకుల్లో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు బంకుల తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి నగదును అపహరించినట్లు బంకు వ్యాపారస్తులు చావా ప్రభాకర్, పోలవరపు నారాయణ తెలిపారు.శుక్రవారం ఉదయం చోరీ విషయాన్ని స్థానికులు, బంకుల యజమానులు ఎస్సై వెంకటేశ్వర రెడ్డి కి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేశ్వరరెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రెండు బంకులను పరిశీలించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించి, బంకు యజమానులు, స్థానికుల నుంచి వివరాలను సేకరించారు.ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ చోరీపై వివరాలను సేకరించి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఆరా తీస్తున్నామని, చోరీకి పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# నారాయణస్వామిని దర్శించుకున్న సంయుక్త కమిషనర్ బి మహేశ్వర రెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 4**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మల్టీజోన్-2, తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ బి. మహేశ్వర రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దేవస్థానంలోని నారాయణస్వామిని దర్శనం చేసుకుని అనంతరం దేవస్థాన ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ధ్యాన మందిరం పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనుల నాణ్యత, భక్తులకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై సంబంధిత సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేవస్థాన ఆవరణలో పచ్చదనం పెంపొందించేందుకు దేవతా వృక్షాలను నాటి వాటిని సంరక్షించి వృక్షాల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వెలుగొండ జలాలతో పల్లెల్లో సంతోషం

## నాగరాజుకుంటలో 30 కుటుంబాలు టీడీపీలో చేరిక



**కొనకనమిట్ల పెన్ పవర్ సెప్టెంబర్ 4**

వెలుగొండ ప్రాజెక్టు నీటి విడుదలతో మండలంలోని పల్లెల్లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి.ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలుగొండ జలాలు అందుబాటులోకి రావడంతో ప్రజల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.పార్టీలకు,కులాలకు అతీతంగా వెలుగొండ నీటి విడుదలపై గ్రామాల్లో విస్తృత చర్చ జరుగుతోంది.ఈ నేపథ్యంలో కొనకనమిట్ల మండలం నాగరాజుకుంట గ్రామంలోని ఎస్సీ పాలెంకు చెందిన 30 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి.మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో వారు టీడీపీ కండువాలు కప్పుకున్నారు.ఎమ్మెల్యే గ్రామానికి చేరుకోగానే స్థానికులు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. వెలుగొండ ప్రాజెక్టు నీటి విడుదలతో తమ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారమైందన్నారు. ఇకపై సాగునీటి సౌకర్యం మెరుగుపడి వ్యవసాయం, పండ్ల తోటలు అభివృద్ధి చెందుతాయని, వలసలు తగ్గే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు నీటి విడుదలకు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిపై నమ్మకంతో టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు.ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా మార్కాపురం ప్రత్యేక జిల్లా సాధించామని, వెలుగొండ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలం కానుందని అన్నారు. హార్టికల్చర్ హబ్ అభివృద్ధితో రైతులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఇంటింటికీ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని, పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ సెప్టెంబర్ 04**

చెట్ల కొమ్మలు తొలగించుటకు, లైన్ మరమ్మత్తుల కారణంగా సంజయ్ గాంధీ నగర్, జిల్లా కోర్టు ఏరియా, సెంట్రల్ కేఫ్, రాజా పానకాల రోడ్డు,1లైన్ నుండి 14 లైన్ వరకు, గద్దలగుంట, పోస్ట్ ఆఫీస్, హరే రామ బజార్ సాయిబాబా టెంపుల్ ఎదురు బజార్ , ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, రాజీవ్ నగర్ రాజీవ్ నగర్ ఎక్స్టెన్షన్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఒంగోలు టౌన్ డిఈఈ కేవీ పాండురంగారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. శనివారం ఉదయం 7.00 గంటల నుండి 11.00 గంటల వరకు పై తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. కావున వినియోగదారులు అందరూ సహకరించవలసినదిగా ఆయన కోరారు.

# పాలుట్ల గిరిజన తండాలో నీటి సమస్య పరిష్కరించండి

## ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేత



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 4**

మండలంలోని పాలుట్ల తాండ గిరిజన గూడెంలో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని కోరుతూ స్థానిక సర్పంచ్, గ్రామ పెద్దలు శుక్రవారం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామ ప్రతినిధులు మాట్లాడుతూ, పాలుట్ల తండా, గిరిజన గూడెంలో వేసవి తీవ్రతతో పాటు భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటికి తీవ్ర కొరత ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు బిందెడు నీటి కోసం కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోందని, నిత్యవసరాలకు కూడా నీరు దొరకక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.గిరిజనుల సమస్యలు విన్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో సంప్రదించి నీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. నల్లమల గిరిజన గూడెంలో సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ తో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, జడ్పీటీసీ చేదురి విజయ భాస్కర్, యస్టీ జిల్లా నాయకులు రాములు నాయక్,నాయకులు పాల్గొన్నారు.


# బోధనా సేవలకు మరో ఘనత

## -జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా విజయ రేఖ దాసరి

## - 2026లో ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక

**వలేటివారిపాలెం, పెన్ పవర్ సెప్టెంబరు 4**

విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో సేవలందిస్తున్న ఉపాధ్యాయురాలు విజయ రేఖ దాసరి 2026 సంవత్సరానికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికయ్యారు. ప్రస్తుతం వలేటివారిపాలెం మండలం జెడ్.ఉప్పలపాడు ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఆమెకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల ఉపాధ్యాయ వర్గాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విజయ రేఖ దాసరి 2011 జూలై 30న తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం మురమండ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం అంతర్‌జిల్లా బదిలీలలో భాగంగా కందుకూరు మండలంలోని ఇస్కలవారి వీధి ఎంపీపీ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చి



సేవలందించారు. 2025లో జరిగిన బదిలీలలో భాగంగా వలేటివారిపాలెం మండలం జెడ్.ఉప్పలపాడు ఎంపీపీ ప్రాథమిక పాఠశాలకు వచ్చారు. అప్పటి నుంచి అక్కడ విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు, వారి ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావం, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, సమర్థవంతమైన బోధనా విధానాలను గుర్తించిన అధికారులు ఆమెను 2026 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. విజయ రేఖ దాసరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంపై ఆమె సహచర ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు. ఆమెకు లభించిన ఈ గౌరవం వలేటివారిపాలెం మండలానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# క్రెడిట్ పిచ్చితో జగన్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

## తన ఆత్మవంచనపై జగన్ -ఆత్మపరిశీలన చేసుకోవాలి: ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 4**

పలనాడు జిల్లా, చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూతన ఆత్మవంచనపై జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. నీళ్లు లేకుండా సాగునీటి ప్రాజెక్టుల్ని జాతికి అంకితం చేయడం.. సెట్టింగులు వేసి రైతుల్ని మోసగించడంలో జగన్ సమర్థుడని ప్రజలకు బాగా తెలుసు. అలాంటి నాయకుడు కూటమిప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని గుర్తించకుండా నిజాల్ని వక్రీకరిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబును నిందించడాన్ని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో సమర్థించరు. రాష్ట్రప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, సమృద్ధిగా సాగునీరు అందించాలన్న చంద్రబాబు సంకల్పబలం ముందు జగన్ విషప్రచారం నిలవదు. చంద్రబాబు దూరదృష్టి, పట్టుదల, నిర్విరామ కృషి వల్లే మొన్న వెలిగొండకు కృష్ణా జలాలు, నిన్న అనకాపల్లికి గోదావరి నీళ్లు వచ్చాయన్నది ప్రజలెరిగిన సత్యం. అవినీతి, దోపిడీలు తప్ప రాష్ట్రానికి, తమకు జగన్ ఎప్పటికీ మంచి చేయడని, అసలు కలలో కూడా జగన్ కు ఆ ఆలోచన రాదని ప్రజల గట్టి నమ్మకం. ఇతరుల విజయాల్ని తనవిగా చెప్పుకున్నంతకాలం ప్రజల దృష్టిలో జగన్ ఎప్పటికీ అసమర్థుడిగానే మిగిపోతాడు. తన హయాంలో .. తన తండ్రి హయాంలో ముఖ్యమైన పనులు జరిగాయని అవినీతి పత్రికలో దుష్ప్రచారం తప్ప, ఆధారాలతో కూడిన వాస్తవాల్ని జగన్ ఎందుకు ప్రజల ముందు ఉంచడం లేదు? నిధుల కేటాయింపులు లేకుండా.. క్షేత్రస్థాయిలో పనుల పురోగతి



కనిపించకుండా, భూములిచ్చిన నిర్వాసితులకు న్యాయం చేయకుండా అంతా తామే చేశామంటున్న జగన్ అజ్ఞానాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఎవరి కాలంలో పనులు జరిగాయో..ఎవరి పాలనలో నీళ్లువచ్చాయో ప్రజలకు తెలియదా? క్రిమినల్ నాలెడ్జ్ , క్రెడిట్ పిచ్చితో ప్రజల్ని తప్పుదోవ పట్టించి, రాజకీయలబ్ధి పొందాలన్నదే జగన్ ఎత్తుగడ. ఆయన..వైసీపీనేతలు మున్ముందు ఇదే పంథాను కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీఖాతాలో సున్నాశాతం ఓట్లే క్రెడిట్ చేస్తారు." అని ప్రత్తిపాటి గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మెరుగైన రహదారి వ్యవస్థ అత్యంత కీలకం

**ఆలమూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 4**

డాక్టర్అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం లోగ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మెరుగైన రహదారి వ్యవస్థ అత్యంత కీలకమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు రహదారులు తోడ్పడతాయని తెలిపారు. శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని దేవరపల్లి, ఆలమూరు గ్రామాల్లో రూ.1.50కోట్ల సాస్కీ నిధులతో చేపట్టిన రెండు బీటీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. తొలుత రూ.60లక్షలతో నిర్మించనున్న దేవరపల్లి శివారు మట్టలదొడ్డి రహదారికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం రూ.90 లక్షలతో ఆలమూరు పల్లిపేట నుంచి సూర్యారావుపేట వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. తదుపరి ఆలమూరులో రూ. 80 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు.



# కూటమిలో మైక్రో మేనేజ్‌మెంట్

**ఏలూరు, సెప్టెంబర్ 4, పెన్ పవర్:**
నరసాపురం నియోజకవర్గంలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్థానిక జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పనితీరుపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. నియోజకవర్గానికి చెందిన 25 కేపీఐ సూచీల్లో 23 మైనస్ ఉన్నాయని సభాముఖంగా స్పష్టం చేస్తూ, నోడల్ అధికారిని మార్చాలని కలెక్టర్‌ను ఆదేశించడం, అధికారులకు గట్టిగా క్లాస్ తీసుకోవడం కలకలం రేపింది. పాలనా సంస్కరణలు, పనితీరు ఆధారిత నాయకత్వంపై చంద్రబాబుకు ఉన్న పట్టుకు ఇది నిదర్శనమే అయినా, మిత్రపక్ష ఎమ్మెల్యేను ప్రజల ముందే అలా నిలదీయడం కూటమి ధర్మానికి విఘాతం కలిగిస్తుందా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.తెలుగుదేశం పార్టీ అధినేతగా సొంత పార్టీ ఎమ్మెల్యేలను, మంత్రులను చంద్రబాబు వేదికలపై లేదా సమీక్షా సమావేశాల్లో హెచ్చరించడం దశాబ్దాలుగా వస్తున్న శైలి. టీడీపీ ప్రజాప్రతినిధులు ఆ వ్యాఖ్యలను పార్టీ పెద్ద ఇచ్చే హెచ్చరికగా పరిగణిస్తారు. కానీ, కూటమి భాగస్వామి అయిన జనసేన పార్టీ ప్రజాప్రతినిధి విషయంలో అదే వ్యూహాన్ని వర్తింపజేయడం పొలిటికల్ ప్రోటోకాల్‌ను ఉల్లంఘించడమేనని భావిస్తున్నారు. జనసేన ఎమ్మెల్యేలు నేరుగా పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పనిచేస్తుండటంతో, వారి పనితీరుపై చర్యలు లేదా హెచ్చరికలు ఉంటే అంతర్గత సమన్వయ కమిటీల ద్వారా లేదా పవన్ కళ్యాణ్ ద్వారా ఇప్పించడమే సరైన పద్ధతిగా చెబుతున్నారు. ఈ బహిరంగ వ్యాఖ్యల పట్ల జనసేన కేడర్, జనసైనికులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తమ ఎమ్మెల్యేకు పనితీరు సరిగా లేకపోతే సరిదిద్దే బాధ్యత తమ అధినేత పవన్ కళ్యాణ్‌ది అని, మైకుల ముందుకు వచ్చి ఒక నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇమేజ్‌ను ప్రజల ముందు తగ్గించడం వల్ల రాబోయే రోజుల్లో గ్రౌండ్ లెవెల్‌లో కేడర్ మధ్య వైషమ్యాలు పెరుగుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. మిత్రపక్ష నాయకుడి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా పబ్లిక్ వేదికలపై మాట్లాడటం వల్ల క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య ఉండాల్సిన ఐక్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇది రాబోయే రోజుల్లో మరింత పెద్ద రాజకీయ వివాదానికి ఆజ్యం పోసే అవకాశముంది. రేపు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏదైనా ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు, పాలనాపరమైన లోపాలున్న ఏదేని టీడీపీ ఎమ్మెల్యేను లేదా టీడీపీ మంత్రుల నియోజకవర్గాలను ఉద్దేశించి ఇదే తరహాలో వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు ఎలా ఉంటాయనే ప్రశ్న వస్తోంది. పవన్ కళ్యాణ్ కూడా టీడీపీ ప్రజాప్రతినిధులపై బహిరంగంగా విమర్శలు గుప్పిస్తే, అది పొత్తు ధర్మానికి ముగింపు పలికి రెండు పార్టీల మధ్య పరస్పర దాడులకు దారితీస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డేటా-డ్రివెన్ గవర్నెన్స్‌కు, రిపోర్ట్ కార్డులకు అత్యంత ప్రాధాన్యమిస్తారు. పాలనలో సీనియారిటీ, పొత్తులు చూడకుండా పనితీరునే ప్రామాణికంగా తీసుకుంటారనే సందేశాన్ని ప్రజల్లోకి పంపాలనేది ఆయన ఆలోచన కావచ్చు. రాష్ట్రాభివృద్ధికి కూటమి స్థిరత్వం ఎంత ముఖ్యమో గ్రహించిన క్రమంలో, వ్యూహాత్మకంగా మైక్రో మేనేజ్‌మెంట్ వ్యాఖ్యలను అంతర్గత సమావేశాలకే పరిమితం చేయకపోవడం చంద్రబాబు చేసిన ఒక చిన్న రాజకీయ అంచనా పొరపాటేనని నిపుణులు భావిస్తున్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించాలంటే రిపోర్ట్ కార్డులను అమలు చేయడం ఎంత ముఖ్యమో, మిత్రపక్షాల ఆత్మగౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమన్న భావన వ్యక్తమవుతోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## స్టీల్ ప్లాంట్ ఆస్తులు వేలం

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 4, పెన్ పవర్:** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మిగులు భూముల్ని మరోసారి వేలం నిర్వహించబోతున్నారు. విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, గాజువాక ఆటోనగర్ ప్రాంతం ఉన్న 459 ప్లాట్ల విక్రయానికి ఎన్‌ఎల్‌ఎంసీ (నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్) రూ.858.68 కోట్ల రిజర్వ్ ధరతో ఈ--ఆక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నిధుల సమీకరణ, అసెట్ మానిటైజేషన్‌లో భాగంగా వేలంపాటకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలోని సీతమ్మధార పరిధిలో ఉన్న హెచ్‌బీ కాలనీలో 456 ప్లాట్లు 87,949.77 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయి.. వాటిని రూ.838.93 కోట్ల రిజర్వ్ ధరతో వేలానికి సిద్ధమయ్యారు. అలాగే గాజువాక ఆటోనగర్‌లోని బ్లాక్-- 2లో 2,728 చదరపు గజాలలో, మూడు బ్లాక్--3లోని 2894.44 చదరపు గజాల్లో ఉన్న రూ.19.75 కోట్లు విలువైన ప్లాట్లను వేలం వేయనున్నారు.ఈ ఏడాది అక్టోబర్ 12వతేదీన ఉదయం 11 గంటల నుంచి 243 ప్లాట్లకు.. 16వతేదీన ఉదయం 11 గంటల నుంచి 216 ప్లాట్లకు వేలం నిర్వహించనున్నారు. అక్టోబర్ 12న 243 ప్లాట్లకు సంబంధించి వేలంలో పాల్గొనేవారు అక్టోబర్ 8 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. అక్టోబర్ 16న 216 ప్లాట్లకు సంబంధించి వేలంలో పాల్గొనేవారు అక్టోబర్ 14 సాయంత్రం 5 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఒకవేళ ఎవరైనా ఈ ప్లాట్లను చూడాలనుకుంటే కేవీ సుబ్బరాజు, 9849091798.. ఎం ఆంజనేయులు, 9989898999 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.35 ఏళ్ల క్రితం విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఉద్యోగుల కోసం సీతమ్మధార ప్రాంతంలోని హెచ్‌బీ కాలనీలో 22.19 ఎకరాల విస్తీర్ణంలో 830 క్వార్టర్లు నిర్మించారు. కానీ స్టీల్‌ప్లాంట్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఈ ప్లాట్లు ఉండటంతో ఉద్యోగులు అక్కడ ఉండటానికి ఆసక్తి చూపించలేదు. ఈ క్వార్టర్లకు సరైన నిర్వహణ లేకపోవడంతో శిథిలమైపోయాయి. ప్రస్తుతం ఈ ప్లాట్లు ఉన్న ప్రాంతంలో భూముల ధరలు పెరిగాయి. అక్కడ గజం రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షలు పలుకుతోందని చెబుతున్నారు. గతంలో ఈ-వేలం ద్వారానే హెచ్‌బీ కాలనీలో కొన్ని ప్లాట్లు విక్రయించగా.. రూ.150 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఇప్పుడు మరోసారి వేలానికి సిద్ధమవుతున్నారు. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, ఆటోనగర్‌లో ఉన్న భూములు.. హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాల్లో ఉన్న భూముల్ని విక్రయించేందుకు సిద్ధమైంది. కానీ ఈ భూముల విక్రయించొద్దంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కోర్టులో పిల్ దాఖలు చేయడంతో స్టే విధించారు.. దీంతో కొన్నాళ్లు ఈ భూముల వేలం ప్రక్రియ ఆగిపోయింది.. మళ్లీ ఇప్పుడు మరోసారి భూముల వేలానికి సిద్ధమయ్యారు.

## ఆరణికి రాజకీయ ఇబ్బందులు

**తిరుపతి, సెప్టెంబర్ 4, పెన్ పవర్:** కొందరు పార్టీలు మారి ఎమ్మెల్యేలు కావచ్చు. అంత మాత్రాన పట్టున్న నియోజకవర్గంలో కాలరెగరేస్తే రాజకీయ భవిష్యత్ ఇబ్బందుల్లో పడే అవకాశముంది. ప్రస్తుతం జనసేన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిస్థితి కూడా అలాగే ఉంది. తిరుపతి నియోజకవర్గంలోని జనసేన నేతలు, కార్యకర్తల నుంచి ఆయన వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. ఇక కూటమిలోని మిత్ర పక్షాలు కూడా ఆయనకు మద్దతుగా నిలిచే అవకాశం కనిపించడం లేదు. ఆయన తిరుపతి ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడంతో పాటు, తమను కూడా దూరం పెట్టడంతో కూటమిలోని మిత్ర పక్షాల నుంచి ఆరణికి రాజకీయ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయనపై ఉన్న అసంతృప్తి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశముందన్న ఆందోళన జనసేన నేతల్లో ఉంది. స్థానిక క్యాడర్ నుంచి... తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై పార్టీ క్యాడర్, స్థానిక నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జనసేన క్యాడర్‌ను పట్టించుకోకపోవడంతో పాటు అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ కార్యకర్తలను, సీనియర్లను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.వైసీపీ నేతలతో సంబంధాలు కూడా ఆరణి శ్రీనివాసులుకు ఇబ్బందిగా మారాయంటున్నారు. కూటమి కార్యకర్తలను పక్కన పెట్టి, కొందరు వైసీపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక మున్సిపల్ కార్పొరేషన్ వ్యవహారాలలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యే బంధువులు, కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడం వివాదాస్పదమైంది. ఇప్పటికే ఆరణి శ్రీనివాసులుపై సొంత పార్టీ నేతలే ఫిర్యాదు చేయడంతో సమన్వయంతో పనిచేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్వయంగా ఆయనకు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఆరణి శ్రీనివాసులు వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చారు. 2019 లో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు. నాడు తిరుపతి ప్రాంతంలోని అనేక మంది వైసీపీ నేతలతో సంబంధాలున్నాయి. ప్రధానంగా భూమన కరుణాకర్ రెడ్డితో ఆయనకు సన్నిహిత్వం ఉందంటారు. అలాగే మరి కొందరు వైసీపీ నేతలను కూడా ఆయన దగ్గర తీస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విపక్ష వైసీపీ చేసే విమర్శలకు కూడా ఆరణి శ్రీనివాసులు కౌంటర్ ఇవ్వకపోవడం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేసినా చూసీచూడనట్లు వ్యవహరించడంతో పార్టీ నాయకత్వం కూడా ఆయన వ్యవహార శైలి పట్ల ఆగ్రహంగా ఉందని తెలుస్తోంది. వివాదాలు లేకపోయినా.. అనేక ఆరోపణలు ఆరణి శ్రీనివాసులును చుట్టుముడుతుండటంతో ఆయన రాజకీయంగా ఇబ్బందులలో పడినట్లేనని సొంత పార్టీ నేతలే చెబుతుండటం విశేషం.

## నాదెండ్ల మనోహర్ పై అసహనం

**గుంటూరు, సెప్టెంబర్ 4, పెన్ పవర్:**
జనసేన పార్టీలో కీలక నేత నాదెండ్ల మనోహర్ పై ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. నాదెండ్ల తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు రాజకీయంగా తప్పుదోవ పట్టిస్తున్నారన్న భావన క్యాడర్ లో నెలకొంది. అంతా తానే అయి.. అధినేతను ఎవరినీ కలవనివ్వకుండా, వాస్తవ విషయాలను చెప్పనివ్వకుండా దాచి ఉంచుతున్నారని సోషల్ మీడియా వేదికగా ఆరోపిస్తున్నారు. నాదెండ్ల మనోహర్ పై ఇటువంటి ఆరోపణలు కొత్తేమీ కాదు. జనసేన పార్టీ పెట్టిన నాటి నుంచి పవన్ కళ్యాణ్ వెన్నంటే ఉన్న నాదెండ్లను పార్టీ నేతలు, కార్యకర్తలు వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. తమ వ్యతిరేకతను సోషల్ మీడియాలో వ్యక్త పరుస్తున్నారు. అంతే తప్పించి సభల్లోనూ, సమావేశాల్లోనూ పవన్ కళ్యాణ్ కు చెప్పేందుకు మాత్రం ప్రయత్నం చేయడం లేదు. అయితే నాదెండ్ల కేవలం పవన్ చేసిన సూచనల మేరకే అమలు చేస్తున్నారని, ఇందులో ఆయన తప్పేముందని కూడా కొందరు నాదెండ్ల మనోహర్ ను సమర్థిస్తున్నారు.ప్రపంచ పటాలు పరిశీలించండి.పార్టీలో కీలకంగా మారడంతో... ఇక ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పవన్ కళ్యాణ్ అస్వస్థతకు గురి కావడం, చంద్రబాబుతో భేటీలోనూ, పార్టీ నేతల సమావేశంలోనూ నాదెండ్ల మనోహర్ కీలకం గా వ్యవహరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఆయనను నమ్మి కీలక పాత్రను అప్పగించారని చెబుతున్నారు. జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పై పార్టీ క్యాడర్ మరియు నేతల్లో కొంత అసంతృప్తి ఉందనే ప్రచారం సోషల్ మీడియా మరియు కొన్ని రాజకీయ వర్గాల్లో సాగుతుంది. .ప్రస్తుతం జనసేన పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతున్న తరుణంలో, నాయకత్వం మరియు క్యాడర్ మధ్య సమన్వయం కోసం ఆయన విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గెలిచే స్థానాల్లోనే పోటీ చేయాలని, బలం లేని చోట పోటీకి దిగవద్దని నాదెండ్ల మనోహర్ మనోహర్ వ్యాఖ్యానించడం దిగువ శ్రేణి నేతల్లో ఆగ్రహానికి కారణమయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు తో పాటు పొత్తుల విషయంలో నాదెండ్ల మనోహర్ పవన్ ను తప్పుదోవ పట్టించి తిరిగి తమకు అన్యాయం చేయడానికి సిద్ధమయ్యారని కొందరు నేరుగానే ఆరోపిస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో కూటమి పొత్తుల వల్ల కొందరు స్థానిక జనసేన నేతలకు పోటీ చేసే అవకాశం దక్కకపోవడంతో అంతర్గతంగా కొంత అసంతృప్తి వ్యక్తమైంది. కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నేతల మధ్య ఉన్న విభేదాలు, నాదెండ్ల మనోహర్ వైఖరిపై విమర్శలుగా మారాయి. కూటమి ప్రభుత్వం మరియు జనసేన పార్టీలో చీలికలు తేవడానికి వైసీపీ వంటి ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని జనసేన వర్గాలు మండిపడుతున్నాయి.పార్టీలో ఎటువంటి అంతర్గత విభేదాలు లేవని, జనసేనలో కేవలం "పవన్ కళ్యాణ్ గ్రూప్" మాత్రమే ఉందని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు, వీరమహిళకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు.తాను ఎక్కడికి వెళ్లినా జనసైనికులు ఆత్మీయంగా పలకరిస్తున్నారని, పార్టీ శ్రేణులు అంతా ఐక్యంగా ఉన్నారని నాదెండ్ల మనోహర్ ఇటీవలే పేర్కొన్నారు.




**హైదరాబాద్ పెన్ పవర్:** అధికార టీడీపీ చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. 40 రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం శనివారం కోటి ఇళ్ల మైలురాయిని దాటినట్లు మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. రెండేళ్ల కూటమి పాలనా విజయాలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా టీడీపీ అధిష్టానం 'ఇంటింటికి తెలుగుదేశం' ప్రారంభించింది. జూలై 27న మొదలైన ఈ కార్యక్రమాన్ని 45 రోజుల పాటు కొనసాగించాలని నిర్ణయించారు. కేబినెట్ మినిస్టర్ నుంచి సామాన్య కార్తకర్త వరకు ప్రతి ఒక్కరూ 'ఇంటింటికి తెలుగుదేశం'లో చురుగ్గా పాల్గొనాలని పార్టీ ఆదేశించింది. ఇక పార్టీ శ్రేణులు సైతం అధిష్టానం ఆదేశాల ప్రకారం పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహించిందని అంటున్నారు.
ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రంలో కోటి ఇళ్లను సందర్శించారని మంత్రి నారా లోకేశ్ చేసిన ట్వీట్ లో తెలిపారు. "కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో గొప్ప మైలురాయి స్థాపించారు" అంటూ మంత్రి కొనియాడారు. ఇంటింటి పర్యటనల్లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలను కలిసి వివరించిన తీరు చాలా బాగుందని ఆనందం వ్యక్తం చేశారు.
కోటి ఇళ్లు సందర్శించడమే కాకుండా ఆయా కుటుంబాల సమస్యలు, స్థానిక అవసరాలు, ప్రభుత్వ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన కార్యకర్తలను మంత్రి లోకేశ్ అభినందించారు. ఇక కోటి ఇళ్లకు టీడీపీ నేతలు వెళ్లారంటూ మంత్రి చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. రాష్ట్రంలో ఏ పార్టీ కూడా ఇప్పటివరకు ఇంతటి భారీ కార్యక్రమం నిర్వహించలేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. మరికొద్దిరోజుల్లో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తుండగా, టీడీపీ ముందస్తుగానే ప్రజల్లోకి వెళ్లి ఒక విడత ప్రచారం పూర్తిచేసినట్లుగా భావించాలని అంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతోపాటు ప్రజలతో నేరుగా కనెక్ట్ అయ్యే అవకాశం కలిగిందని అంటున్నారు.
మరోవైపు కూటమి ప్రభుత్వంలో టీడీపీ సొంతంగా నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రభుత్వంలో మూడు పార్టీలు ఉన్నప్పటికీ టీడీపీ సొంతంగా ఈ కార్యక్రమం నిర్వహించింది. అయినప్పటికీ ఎక్కడా మిత్రపక్షాల మనోభావాలను ప్రభావితం చేసేలా పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయంగా పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో 40 రోజుల పాటు ప్రభుత్వ పెద్దలు ప్రజల్లో ఉన్నప్పటికీ ఎక్కడా నిరసన స్వరాలు వినిపించకుండా కార్యక్రమం సాగడం కూడా ప్రభుత్వానికి సానుకూల సంకేతంగా వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి నాలుగు కోట్ల ఓటర్లను పలకరించేలా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఫలితాలను ఇస్తున్న అక్షర ఆంధ్ర

**విజయవాడ, సెప్టెంబర్ 4, పెన్ పవర్:**
దేశంలోనే అత్యంత తక్కువ అక్షరాస్యత కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా విమర్శలు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్, గత రెండేళ్లలో సాధించిన ప్రగతి విద్యా రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. 2024 నాటికి కేవలం 72.6 శాతంగా ఉన్న అక్షరాస్యత, 2026 నాటికి ఏకంగా 82.1 శాతానికి చేరుకుంది. జాతీయ సగటు కంటే వెనుకబడిన స్థితి నుంచి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే దాదాపు 10 శాతం మేర అక్షరాస్యత పెరగడం వెనుక విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ చేపట్టిన పక్కా ప్రణాళికలు, క్షేత్రస్థాయి పరిశీలన, రిజల్ట్-ఓరియంటెడ్ విధానాలే ప్రధాన కారణం.ఈ భారీ మార్పుకు అక్షర ఆంధ్ర కార్యక్రమం వెన్నెముకగా నిలిచింది. విద్యా శాఖను చేపట్టిన వెంటనే నారా లోకేష్, కేవలం పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోనే సరిపెట్టకుండా ఫలితాలు ఆధారంగా పనిచేసే ప్రత్యేక కార్యాచరణను అమలు చేశారు. సుమారు 11 ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో నిర్వహించిన అక్షరాస్యతా విభాగాలు, ఫీల్డ్ ప్రోగ్రామ్‌ల ద్వారా గత ఏడాది కాలంలోనే దాదాపు 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడం లోకేష్ పరిపాలనా దక్షతకు అద్దం పడుతోంది.అంతేకాకుండా, పాఠశాల విద్యలో డ్రాపౌట్లను తగ్గించి హాజరు శాతాన్ని పెంచడంపై మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారు. రాజ్యూయా యాప్ ద్వారా బడికి దూరమైన 1.64 లక్షలకు పైగా పిల్లల డేటాను సేకరించి, వారిలో సుమారు 33 వేల మందిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, టీచర్ల హాజరును 98.97 శాతానికి తీసుకెళ్లడం విద్యావ్యవస్థలో వచ్చిన సమూల మార్పుకు ఉదాహరణ. ఉపాధ్యాయుల కొరత తీర్చే దిశగా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, తల్లికి వందనం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా విద్యార్థుల్లో జవాబుదారీతనాన్ని లోకేష్ పెంచగలిగారు.ఇప్పుడు ప్రభుత్వం విధించుకున్న ప్రతిష్టాత్మక లక్ష్యం సెప్టెంబర్ 2027 నాటికి 100% సంపూర్ణ అక్షరాస్యత సాధించడం. దీనికోసం 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, సెప్టెంబర్ 2027 నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడానికి ప్రజాప్రతినిధులను, స్థానిక సంస్థలను భాగస్వాములను చేస్తూ టైమ్-బౌండ్ టార్గెట్లను నిర్దేశించారు. ఇది కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతీ నియోజకవర్గంలో కార్యాచరణ వేగవంతం అయ్యేలా ఐఏఎస్ అధికారులతో క్రమం తప్పకుండా చేస్తున్న సమీక్షలే ఈ వృద్ధికి బలం చేకూరుస్తున్నాయి.గడిచిన రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో నమోదైన ఈ గణనీయమైన మార్పు నారా లోకేష్ రాజకీయ, పరిపాలనా సామర్థ్యానికి ఒక బలమైన రుజువుగా నిలుస్తోంది. ఒకప్పుడు జాతీయ స్థాయిలో అక్షరాస్యతలో ఆఖరి వరుసల్లో నిలిచిన ఏపీని, 2027 నాటికి దేశంలోనే మొదటి సంపూర్ణ అక్షరాస్యత సాధించిన రాష్ట్రాలలో ఒకటిగా నిలిపేందుకు లోకేష్ వేస్తున్న అడుగులు ఆయన విజనరీ లీడర్‌షిప్‌ను స్పష్టం చేస్తున్నాయి.

# లోకల్ బాడీ ఎన్నికలకు కసరత్తు షురూ

**విజయవాడ, సెప్టెంబర్ 4 పెన్ పవర్:**
ఏపీలో కూటమి పార్టీలు స్థానిక ఎన్నికలు రెడీ అవుతున్నాయి. ఇప్పటికే జనసేన అధిష్ఠానం.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలతో వరుసగా భేటీ అవుతుంది. టీడీపీ కూడా ఎన్నికల కసరత్తును స్పీడప్ చేసింది. ఈ నెల 6, 7 తేదీల్లో టీడీపీ ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఏడు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ ఎమ్మెల్యేలు అందరూ శిక్షణ తరగతులకు హాజరు కావాలని టీడీపీ కేంద్ర కార్యాలయం ఆదేశించింది. ఎన్నికల నిర్వహణ కసరత్తులో భాగంగా ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇవాళ సాయంత్రం మంత్రులు, కీలక నేతలతో సీఎం టింగ్ నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపాలిటీల్లో జరుగుతున్న పనులు, కూటమి పార్టీల సమన్వయంపై చర్చించే అవకాశం ఉంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని, వాయిదా వేసే ప్రసక్తే లేదని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అమరావతిలో టీడీపీ మంత్రులతో ఆయన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ పార్టీ నాయకులకు, ఎమ్మెల్యేలకు ఎన్నికల గురించి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ నాటికి పూర్తవుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసి, అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని మంత్రి లోకేష్ నేతలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు దశలవారీగా జరుగుతాయని మంత్రి లోకేష్ తెలిపారు. మొదటిగా మున్సిపల్ ఎన్నికలు, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఆపై పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లోనూ ఎన్నికలు నిర్వహించేలా ప్రయత్నిస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన అర్హులందరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లను మంజూరు చేస్తామని చెప్పారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. ఎస్ఐఆర్ ఓటర్ల జాబితానే స్థానిక సంస్థల ఎన్నికలకు

తుది జాబితాగా తీసుకోవాలని వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి ఫోర్సులో ఉన్న, చెల్లుబాటయ్యే ఓటర్ల జాబితానే ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయి తుది ఓటర్ల జాబితా వచ్చే వరకు ఎన్నికలను ఆపాల్సిన అవసరం లేదని ప్రభుత్వ వైఖరిగా ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి అమల్లో ఉన్న ఓటర్ల జాబితాతోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై కోర్టు నుంచి అభ్యంతరాలు వచ్చినా.. వాటిని అధిగమించే మార్గాలపై ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. అవసరమైతే పార్టీ పరంగా కూడా బీసీలకు ఓసీ జనరల్ కేటగిరీలో సీట్లు కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలని టీడీపీ భావిస్తోంది.

# అభిషేక్ శర్మ కాదు.. వైభవ్ సూర్యవంశీకి సరైన ఓపెనింగ్ జోడి అతడే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగి భారత జాతీయ జట్టులోకి దూసుకొచ్చిన 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. జూన్‌లో ఇంగ్లాండ్‌పై అంతర్జాతీయ అరంగేట్రం చేసినప్పటికీ, ఆ తర్వాత జరిగిన జింబాబ్వే పర్యటనలో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డుతో తన ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పాడు. ఇప్పటివరకు తాను ఆడిన 6 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ అభిషేక్ శర్మతో కలిసే ఓపెనింగ్ చేశాడు. కానీ, సెప్టెంబర్ 13వ తేదీన ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే మ్యాచ్ ద్వారా వైభవ్ భారత్‌లో తన మొదటి మ్యాచ్ ఆడబోతున్న వేళ, ఓపెనింగ్ జోడీలో మార్పులు చేయాలని మాజీ వికెట్ కీపర్ దీప్ దాస్‌గుప్తా టీమిండియా మేనేజ్‌మెంట్‌కు కీలక సూచన చేశాడు.

**సంజూ శాంసన్ - వైభవ్ కాంబినేషన్ అదుర్స్:**

భారత టీ20 జట్టులో ప్రస్తుతం అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్‌లతో పాటు ఇషాన్ కిషన్ రూపంలో నలుగురు ఓపెనింగ్ ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన దాస్‌గుప్తా, ఇప్పటివరకు అభిషేక్ - వైభవ్, అభిషేక్ - సంజు కాంబినేషన్లను మాత్రమే చూశాం, ఇంకా సంజు - వైభవ్ జోడీని పరీక్షించలేదని పేర్కొన్నాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌లో సంజు శాంసన్‌ను వైభవ్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించేలా చేస్తే ఈ కాంబినేషన్ ఎంతవరకు వర్కవుట్ అవుతుందో క్లారిటీ వస్తుందని అభిప్రాయపడ్డాడు.

**అభిషేక్‌ను పక్కన పెట్టడం కాదు:**

ఈ సరికొత్త కాంబినేషన్ సూచనపై వివరణ ఇస్తూ, అభిషేక్ శర్మను జట్టు నుంచి తొలగించాలని తాను అనడం లేదని దాస్‌గుప్తా స్పష్టం చేశాడు.ద

రాబోయే టీ20 ప్రపంచకప్‌కు ముందు అందుబాటులో ఉన్న ప్రతి ఆటగాడికి, అన్ని కాంబినేషన్లకు తగినంత అవకాశం ఇవ్వడమే ప్రధాన లక్ష్యం.. మెగా టోర్నీకి ముందు జట్టుకు ఏ జోడీ బాగా సెట్ అవుతుందో అర్థం చేసుకోవడానికి, ఆటగాళ్లకు తగినంత మ్యాచ్ టైమ్ ఇవ్వడానికి ఇలాంటి ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడతాయని వెల్లడించాడు.

**రైట్ - లెఫ్ట్ కాంబినేషన్ అడ్వాంటేజ్:**

మరోవైపు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ ముగ్గురూ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు కావడం గమనార్హం. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన సంజు శాంసన్‌ను ఓపెనర్‌గా పంపడంతో జట్టుకు రైట్ - లెఫ్ట్ ఓపెనింగ్ కాంబినేషన్ అడ్వాంటేజ్ కూడా దక్కుతుందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మేనేజ్‌మెంట్ జింబాబ్వే సిరీస్ హీరో వైభవ్ పక్కన సంజు శాంసన్‌ను దించుతుందా లేక పాత ఓపెనింగ్ జోడీకే ప్రాధాన్యత ఇస్తుందా అనేది ఇప్పుడు తీవ్ర ఆసక్తికరంగా మారింది.

# నేడు భారత్--పాక్ మహిళల క్రికెట్ సమరం.. ఎప్పుడు, ఎక్కడ చూడాలంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ఆసియా కప్ 2026లో భారత్--పాకిస్థాన్ జట్ల మధ్య ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. సెప్టెంబర్ 5న దుబాయ్ వేదికగా ఈ హైవోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న భారత జట్టు.. గ్రూప్ దశను మరో విజయంతో ముగించాలని పట్టుదలగా ఉంది.

**హాంకాంగ్‌పై భారీ విజయం**

భారత్ తన గత మ్యాచ్‌లో హాంకాంగ్‌ను 137 పరుగుల తేడాతో చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 20 ఓవర్లలో 193 పరుగులు చేసింది. స్మృతి మంధాన 124 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా.. అనంతరం భారత బౌలర్లు హాంకాంగ్ బ్యాటింగ్‌ను కేవలం 56 పరుగులకే కట్టడి చేశారు. దీప్తి శర్మ మూడు వికెట్లు తీసుకోగా, శ్రీ చరణి, నందిని శర్మ, ప్రీతికా రావల్ రెండేసి వికెట్లతో రాణించారు.

**భారత్-పాక్ మ్యాచ్ వివరాలు**

తేదీ: సెప్టెంబర్ 5, శనివారం

వేదిక: దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం

మ్యాచ్ ప్రారంభం: రాత్రి 8:00 గంటలకు (భారత కాలమానం)

టాస్: రాత్రి 7:30 గంటలకు

టీవీలో: సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్

ఆన్‌లైన్‌లో: సోనీ లివ్

మహిళల ఆసియా కప్ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతున్నాయి. భారత్--పాకిస్థాన్ పోరును కూడా సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, సోనీ లివ్‌లో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు.

**సెమీఫైనల్‌కు ముందు కీలక మ్యాచ్**

భారత్ ఇప్పటికే నాకౌట్ దశకు చేరుకోవడంతో ఈ మ్యాచ్ ఫలితం కంటే సెమీఫైనల్‌కు ముందు జట్టు కూర్పు, ఆటగాళ్ల ఫామ్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉంది. స్మృతి మంధాన, షెఫాలీ వర్మ వంటి బ్యాటర్లు మంచి టచ్‌లో ఉండటం టీమిండియాకు సానుకూల అంశంగా మారింది. మరోవైపు పాకిస్థాన్ కూడా భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తోంది. దీంతో శనివారం రాత్రి జరిగే దాయాదుల పోరుపై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సిరాజ్, పడిక్కల్.. సౌత్ జోన్ జట్టులో చోటు!



**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ ఫైనల్ పోరుకు భారత స్టార్ క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 6 నుంచి ఈస్ట్ జోన్‌తో జరగనున్న ఫైనల్ కోసం సౌత్ జోన్ జట్టులో వీరిద్దరికీ చోటు దక్కింది. ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లోనూ ఇద్దరూ భారత్ తరఫున ఆడారు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది.శ్రీలంక సిరీస్‌లో పడిక్కల్ అద్భుతంగా రాణించాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 328 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. మరోవైపు సిరాజ్ రెండు టెస్టుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్ కోసం వీరిద్దరూ సౌత్ జోన్ జట్టులో ఎవరిని భర్తీ చేస్తారన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు.టీ20 జట్టులో రెగ్యులర్‌గా ఉంటున్న వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా ఫైనల్‌లో ఆడే అవకాశం ఉందని సమాచారం. సెప్టెంబర్ 10న దులీప్ ట్రోఫీ ఫైనల్ ముగియనుండగా.. సెప్టెంబర్ 13 నుంచి ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. అయినా ఫైనల్‌లో ఆడేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తిలక్ ఇప్పటికే చెప్పాడు. నార్త్ జోన్‌తో సెమీఫైనల్లో తిలక్ తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 51 పరుగులతో ఆకట్టుకున్నాడు. సౌత్ జోన్ సెమీఫైనల్లో నార్త్‌ను 181 పరుగుల ఛేదనలో ఓడించింది. మరోవైపు ఈస్ట్ జోన్ 159 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను ఫైనల్ రేసు నుంచి తప్పించింది. ఇషాన్, సూర్యవంశీ ఆడకపోతే ఈస్ట్ జోన్ కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది. బెంగాల్‌కు చాలాకాలంగా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అభిమన్యు ఈశ్వరన్‌కు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

# యశ్ ఈసారి వెళ్లేది ఏ పరిశ్రమకి!

-కేజీఎఫ్- ఫ్రాంచైజ్‌తో కన్నడ చిత్ర పరిశ్రమ సరిహద్దులు దాటి పాన్-ఇండియా స్థాయిలో తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకున్నారు రాకింగ్ స్టార్ యశ్. ఒక్క సినిమాతో గ్లోబల్ గుర్తింపు తెచ్చుకున్న యశ్ ప్రతీ ప్రాజెక్ట్‌ను వ్యూహాత్మకంగా ఎంచుకుంటున్నారు. కన్నడ ఇండస్ట్రీకి చెందిన ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో చేసిన -కేజీఎఫ్- ప్రభంజనం అనంతరం .. మలయాళ పరిశ్రమకు చెందిన ప్రతిభావంతమైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో కలిసి -టాక్సిక్- చిత్రాన్ని పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే. ఇటీవలే భారీ అంచనాల మధ్య విడుదలైందీ చిత్రం. ఇలా విభిన్న పరిశ్రమల ట్యాలెంట్ తో ముందుకు సాగుతున్న యశ్ తదుపరి చిత్రం కోసం ఏ పరిశ్రమ వైపు అడుగులు వేస్తారనేది ఆసక్తికరం.







యశ్ ప్రయాణాన్ని పరిశీలిస్తే ఆయన కేవలం ఒకే పరిశ్రమకు ఫార్ములాకు కట్టుబడి ఉండటం లేదని స్పష్టమవుతోంది. కన్నడ డైరెక్టర్‌తో ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన యశ్ ఆ తర్వాత కేరళకు చెందిన ఆఫ్-బీట్ .. కంటెంట్-డ్రివెన్ ఫిల్మ్ మేకర్ గీతూ మోహన్‌దాస్‌ను ఎంచుకుని ఆశ్చర్యపరిచారు. ఈ ప్రయోగం ఆయన మేకింగ్‌లో .. కథల ఎంపికలో సరికొత్త కోణాన్ని ఆవిష్కరించింది. విభిన్న చిత్ర పరిశ్రమలలోని ప్రతిభను ఉపయోగిస్తూ గ్లోబల్ ఆడియన్స్‌ను ఆకట్టుకోవడమే లక్ష్యంగా యశ్ ప్రణాళికలు సాగుతున్నాయి.

ఈ నేపథ్యంలోనే యశ్ తదుపరి చిత్రం ఏ ఇండస్ట్రీకి చెందిన దర్శకుడితో ఉండబోతోందనే దానిపై చర్చ నడుస్తోంది. ప్రస్తుతం కోలీవుడ్ ..టాలీవుడ్ పరిశ్రమలకు చెందిన పలువురు అగ్ర దర్శకులు ఆయనతో సినిమాలు చేసేందుకు క్యూలో ఉన్నారని తెలిసింది. తమిళ పరిశ్రమలోని భారీ యాక్షన్ యూనివర్స్ సృష్టించే విజనరీ దర్శకులు, టాలీవుడ్‌లోని లార్జర్ ద్యాన్ లైఫ్ కాన్సెప్ట్‌లను తెరకెక్కించే స్టార్ డైరెక్టర్లు యశ్ కోసం పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌లను సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

ముఖ్యంగా టాలీవుడ్ మాస్ .. హై-వోల్టేజ్ డ్రామాలకు పెట్టింది పేరు . కోలీవుడ్ గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే .. స్టైలిష్ ప్రెజెంటేషన్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. యశ్ కున్న మాస్ ఇమేజ్‌కు టాలీవుడ్ దర్శకుడి విజన్ తోడైతే బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. కోలీవుడ్ లో ఉన్న టాలెంటెడ్ మేకర్స్‌తో జతకడితే యశ్ మార్కెట్ మరింత విస్తరించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండింటిలో యశ్ ఎవరికి ఓటు వేస్తారనేది ఆసక్తికరం. చివరిగతా ఉత్తరాది, దక్షిణాది సరిహద్దులను చెరిపేస్తూ ప్రతీ భాషలోని అత్యుత్తమ సాంకేతిక నిపుణులను, దర్శకులను ఒకే వేదికపైకి తెచ్చేలా యశ్ వ్యూహం కనిపిస్తోంది. అందుకే యశ్ తదుపరి ఎంపిక కూడా ప్రతిష్టాత్మకంగా ఊహించని కాంబినేషన్‌లో ఉండే అవకాశం ఉందనే ప్రచారం బలపడుతోంది. దీనిపై పూర్తి క్లారిటీ రావాలంటే మరింత సమయం పడుతుంది. ప్రస్తుతం యశ్ బాలీవుడ్ లో తెరకెక్కుతోన్న -రామాయణం-లో రావణుడి పాత్ర పోషిస్తోన్న సంగతి తెలిసిందే. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న చిత్రం మొదటి భాగం దీపావళి కానుకగా రిలీజ్ అవుతుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com